Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.11.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## • అసెంబ్లీ బహిష్కరణ...

# తప్పటడుగా? తప్పని అడుగా?



- అధికార పక్షానికి ఆయుధమందించినట్లే!
- జగన్ నిర్ణయంపై రాజకీయవర్గాల్లో మిశ్రమ స్పందన

**అధికారపార్టీ ఎప్పుడు తప్పు చేస్తుందా? ఎక్కడ దొరుకుతుందా? అని ప్రతిపక్షం అనుక్షణం కాపు కాయాలి. అధికార పార్టీ చేసే తప్పులను శాసనసభ వేదికగా కడిగిపారేయాలి. అధికారంలో వున్న వాళ్ళ అక్రమాలను ప్రజల ముందు ఎత్తిచూపి వారిని దోషులుగా నిలబెట్టాలి. ప్రతిపక్ష నాయకుడి బాధ్యత అది. ప్రతిపక్షనేతలు ప్రజాదరణ పొందేది అక్కడే! అంతేగాని ప్రతిపక్ష నేతే తప్పటడుగులు వేసి అధికారపార్టీకి వాళ్ళే ఆయుధం అందించడం ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది.**

ఏ.పి ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ఎవరు ఉచిత సలహాలిస్తున్నారోగాని తప్పటడుగుల పరంపర కొనసాగుతూనే వుంది. శాసనసభ అన్నది ప్రజాసమస్యలను చర్చించే వేదిక. పరిపాలనలోని లోపాలను ఎత్తి చూపుతూ అధికార పార్టీని ప్రశ్నలతో ఆడుకునే వేదుక. అసెంబ్లీ సమావేశాలంటే అధికారపార్టీ వణకాలి. ప్రతిపక్షం ఉరకాలి. ప్రతిపక్షం దెబ్బకు అధికార పార్టీ నాయకుల పంచెలు తడవాలి. సభలో పరిస్థితులు ప్రతిపక్షానికి చెలగాటంగానూ, ప్రభుత్వానికి ప్రాణ సంకటంగానూ మారుతుంటాయి. అలాంటి అసెంబ్లీ (మిగతా 11వ పేజీలో)



## అన్ని శాఖలకు.. ఆయనే అధిపతి

- రెండు, మూడు శాఖల్లోనే కనిపిస్తున్న మంత్రుల పనితీరు
- మిగతా మంత్రులు చినబాబు చేతిలో కీలుబొమ్మలే!

**గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలోనైనా, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మంత్రులకు కూడా ముఖ్యమంత్రి స్థాయి గుర్తింపు ఉండేది. ఒక్కోశాఖపై ఒక్కొక్కరి ముద్ర వుండేది. ఫలానా శాఖ మంత్రి ఎవరంటే వారి పేర్లు ప్రజల నాలుక మీదే వుండేది. హోంమంత్రులుగా మాధవరెడ్డి, ఇంద్రారెడ్డి, జానారెడ్డి, వ్యవసాయశాఖ మంత్రిగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రిగా రోశయ్య, రెవెన్యూ మంత్రిగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అశోక్‌గజపతిరాజు, పంచశాఖల మంత్రిగా సోమిరెడ్డి... ఇలా మంత్రులు తమ తమ శాఖలలో తమ పనితీరు ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే వాళ్ళు. ఆ శాఖలపై తమదైన ముద్రను వేసుకునే వాళ్ళు.**

మరిప్పుడు కూడా కేబినెట్ వుంది. ఈ కేబినెట్‌లో అలాంటి మంత్రులు ఎంతమంది వున్నారు? ఎంతమంది తమ శాఖలోని కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళగలుగుతున్నారు? ప్రస్తుతం ఏ.పి కేబినెట్‌లో చాలామంది మంత్రులు డమ్మీలే! ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు యాక్టివ్‌గా వున్నాడు. సీఎం చంద్రబాబు కూడా ఇరిగేషన్ వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. పోలవరం వంటి (మిగతా 11వ పేజీలో)

నేదురుమల్లి ఫౌండేషన్

మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం

ఇంటర్ మరియు EAMCET-2017 లో అధిక మార్కులు, ర్యాంకులు సాధించి NBKRIST, విద్యానగర్‌లో చేరిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం నిర్వహించబడును.



ముఖ్య అతిథి
శ్రీ ఎ.యండి.ఇంతియాజ్, ఐఎఎస్.,
జాయింట్ కలెక్టర్ & అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్,
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.




విశిష్ట అతిథి
ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి,
ఫౌండర్ రిజిస్ట్రార్, విక్రమ సింహపురి యూనివర్సిటీ,
& సి.ఇ.ఓ. విపిఆర్ ఫౌండేషన్, నెల్లూరు.

తేది : 03-11-2017, శుక్రవారం
సమయం : ఉదయం 10.30 గం॥లకు
వేదిక: నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ విద్యానగర్



నేదురుమల్లి రామ్‌కుమార్
ఛైర్మన్, నేదురుమల్లి ఫౌండేషన్

# ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో తిప్పలు తప్పవ్




ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో నూతన పోకడలు తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలతో ప్రజలకు తిప్పలు తప్పవని అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఈ నెలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం అమలులోకి రానున్నట్లు అధికారులు చెపుతున్నారు. ఈ నూతన విధానం వల్ల వినియోగదారులకు లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉంటాయని విమర్శలు వస్తున్నాయి. దీంతో సబ్‌రిజిస్ట్రార్లను డమ్మీలు చేయడం, డాక్యుమెంట్ రైటర్లకు పనిలేకుండా చేయడం ప్రధాన ఉద్దేశ్యంగా గోచరిస్తోంది. ఆన్‌లైన్ విధానం అమలులోకి వస్తే ఎన్నో ఏళ్ళుగా జీవనోపాధి సాగిస్తున్న వందలాది మంది డాక్యుమెంట్ రైటర్లు వీధినపడే అవకాశం ఉంది. గత కొంతకాలం నుంచి అమలులో వున్న ఎనీవేర్ రిజిస్ట్రేషన్(ఎక్కడైనా రిజిస్ట్రేషన్)తో చాలా చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రవేశపెట్టడం వల్ల రిజిస్ట్రేషన్ ఆదాయం గణనీయంగా తగ్గిందనే విమర్శలు వినవస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎనీవేర్‌తో పాటు మొత్తం ఆన్‌లైన్‌లోనే చేస్తామనడం ఎవరికి లాభమో అర్థంకాని పరిస్థితి ఉందని విమర్శలు వస్తున్నాయి. ఎనీవేర్ వల్ల స్థానికంగా కాకుండా ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే స్థానికంగా ఉన్న సమస్యలు తెలియని పరిస్థితి ఉం దని సమాచారం.

ఆన్‌లైన్ చేయడం వల్ల ఎంతమందికి ఇంటర్‌నెట్‌పై అవగాహన ఉందన్నది కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంది. ఆన్‌లైన్ చేయడం వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశంతో కొంత సమయం ఆదా అవుతున్నా సాంకేతిక సమస్యల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితులు ఉన్నాయి. నెల్లూరుజిల్లాలో రిజిస్ట్రేషన్ పరంగా నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టుకు 9, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌కు 10, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో బుజబుజనెల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు లాంటి దూర ప్రాంతాల్లో ఎనీవేర్ వల్ల చాలావరకు రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి.

ఆన్‌లైన్ విధానం అమలైతే ఈ కార్యాలయాలను మూసివేసే అవకాశం వుందనే విమర్శలు వినవస్తున్నాయి. రిజిస్ట్రేషన్ ఏమి జరగని కార్యాలయాలను ఆదాయం తక్కువగా ఉందని చూపించి ప్రభుత్వం మూతవేసే పరిస్థితి వున్నట్లు సమాచారం.

# రైతుల కష్టాలు తీర్చండి



- వైఎస్సార్సీపి రైతు నాయకుడు కొరపాటి మురళీనాయుడు

జిల్లావ్యాప్తంగా రైతాంగం అనేక సమస్యల్లో సతమతమవుతున్నారని, అధికారులు వారి బాధలు పట్టించుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్సీపి రైతు నాయకుడు కొరపాటి మురళీనాయుడు కోరుతున్నారు. ముఖ్యంగా, పొలాలకు ఆధార్ లింక్ తప్పనిసరి అయిన నేపథ్యంలో, ఈ కార్యక్రమంలో తీవ్ర కాలయాపన జరుగుతున్నందువల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. విఆర్‌ఓల వద్ద భూముల రికార్డులన్నీ ఉన్నా కూడా అధికారులు ఆధార్ లింక్ చేయడంలో జాప్యం ఎందుకు జరుగుతున్నదో తెలియడం లేదని, ఇందువల్ల రైతులు సకాలంలో అందుకోవాల్సిన ఎరువులు, ఇతర ప్రయోజనాలను అందుకోలేకపోతున్నారని. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయం పట్టించుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా, మూడేళ్లకోసారి ఉచితంగా ఇచ్చే జిప్సమ్, జింక్ సల్ఫేట్‌లకు సంబంధించి అధికారులు రైతులను మట్టిపరీక్షల కోసం మట్టి నమూనాలు తీసుకురావాలని కోరుతున్నారని, అయితే మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతాంగానికి దీనిపై అవగాహన లేకపోవడం వల్ల ఆ కార్యక్రమం కూడా మందకొడిగానే సాగుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, లేదా సిబ్బంది రైతుల వద్దకే వచ్చి మట్టి పరీక్షలు చేసి, ఆ పొలంలో ఏమి లోపించిందో తెలియజేసి, తగు అవగాహన కలిగించడం వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. మట్టి నమూనాలు ఎలా తీయాలో, ఎంతశాతం మట్టిని ఏ విధంగా తీసుకురావాలో అవగాహన లేక అనేకమంది రైతులు దీనిపై ఆసక్తి చూపలేకపోతున్నారన్నారు. వ్యవసాయ ఉన్నతాధికారులు ఇకనైనా ఈ విషయాలపై దృష్టి పెట్టి రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా పథకాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కాలుష్యాన్ని నివారించండి - వ్యాధులను అరికట్టండి

- మంత్రికి బిజెపి నాయకుల వినతి



నెల్లూరు నగరంలో కాలుష్యం నివారించి, వ్యాధులను అరికట్టేందుకు సత్వర చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.పి.నారాయణకు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి తదితర నాయకులు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. నగరంలో వైరల్‌జ్వరాలు, డెంగీజ్వరాలు, చికెన్‌గున్యా తదితర వ్యాధులు బాగా ప్రబలిపోతున్నాయని, వీటికి ప్రధాన కారణం నగరంలో మురుగువాతావరణం, కాలుష్యం విపరీతంగా ఉండడమేనని, చివరికి ప్రజలకు కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీరు కూడా పరిశుభ్రంగా ఉండడం లేదని, మంచినీటిలో మురుగునీరు కలసి కలుషితమవుతున్నదని వారు పేర్కొన్నారు. చెట్లు నరికివేయడం, ఎక్కడ చూసినా పందులు విపరీతంగా ఉండడం, రైస్‌మిల్లులు, పవర్‌ప్రాజెక్టుల కాలుష్యం, హాస్పిటల్స్, హోటల్స్ నుంచి వచ్చే వ్యర్థపదార్థాలను నేరుగా డ్రైనేజీలో కలపడం వల్ల కాలుష్యం అధికమై నగరప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను సకాలంలో పరిశుభ్రం చేయకపోవడం, సరైన క్లోరినేషన్ చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలకు పరిశుభ్రమైన నీరు కరువవుతోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను, మంచినీటి వసతుల పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కాలుష్యం లేకుండా నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దోమల వల్ల వ్యాధులు ముమ్మరమవుతున్నాయని అంటూ, దోమల బాధ లేకుండా హెల్త్‌అప్ పథకం ద్వారా నెల్లూరు నగరానికి దోమతెరలు ఎక్కువ కేటాయించాలన్నారు. కార్పొరేషన్ వారు వదిలే మురికినీరు నేరుగా పంటకాలువల్లో చేరి చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు నష్టపోతున్నారని, మురికినీటిని శుద్ధిచేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా, ఏసి కూరగాయల మార్కెట్‌వద్ద బాలికల వసతి గృహంలో కనీస సదుపాయాలు కూడా లేవని, దానికి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని వారు మంత్రికి వివరించారు. బిఇడి కాలేజీ విద్యార్థుల వసతిగృహాన్ని పరిశీలించి వారికి ప్రత్యామ్నాయ హాస్టల్ వసతిని కల్పించాలని కోరారు.




# మేఘం మెరిసెను... వర్షం కురిసెను

- జిల్లా రైతాంగంలో మొలకెత్తిన ఆశలు

ఓ పక్క సోమశిల రిజర్వాయర్‌లో 50 టిఎంసీల నీళ్ళు రావడం, ఇంకోపక్క ఐఏబి సమావేశంలో జిల్లాలో రబీ సీజన్‌కు 5లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్ళివ్వాలని నిర్ణయించడం, అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతాంగం ఆనందంలో వుంది. గత ఏడాది రైతులపై పగబట్టినట్లుగా వున్న ప్రకృతి ఈ ఏడాది మాత్రం కరుణించింది. కడప, కర్నూలు జిల్లాల్లో కురిసిన వర్షాలతో పాటు శ్రీశైలం నుండి వదిలిన నీటితో సోమశిలలో 50టీఎంసీలు, కండ్లేరులో 10 టీఎంసీలు నీళ్ళు చేరాయి. గత ఏడాది జిల్లాలో వానలే లేకపోవడంతో ఈ ఏడాది రైతులు రెండో పంట వేయలేదు. తొలి పంటతోనే సరిపెట్టుకున్నారు. సోమశిలకు నీళ్ళు రాక, వర్షాలు పడకపోయివుంటే ఇప్పుడు పైరు కూడా అనుమానంగానే వుండేది. ఈశాన్య ఋతుపవనాల ఆగమనంతో ఇంకా భారీ వర్షాలు పడతాయనే నమ్మకం కూడా ఏర్పడింది. పరిస్థితులు అనుకూలించడంతో రైతులు నారుమళ్ళకు సిద్ధమవుతున్నారు. ఐఏబి సమావేశంలో 5లక్షల ఎకరాలకు నీళ్ళివ్వాలని నిర్ణయించినా, జిల్లా వ్యాప్తంగా పది లక్షల ఎకరాలలో వరిపైరు సాగుచేసే అవకాశముంది. అయితే డెల్టా రైతులు ఆనందంగానే వున్నా మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, వింజమూరు, మర్రిపాడు, వరికుంటపాడు, దుత్తలూరు, ఓజిలి, చిల్లకూరు, చిట్టమూరు, పెళ్ళకూరు తదితర మండలాల్లో మాత్రం ఇంకా సరిగా వానలు పడక, మెట్ట పైర్లు ధైర్యంగా వేయలేని స్థితిలో రైతులున్నారు.

# మహిళల పట్ల గౌరవం పెంచుకోండి



ప్రతిఒక్కరూ మహిళల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని, ఆధునిక యువతరం బాధ్యతాయుతమైన మంచిబాటలో పయనించి సమాజంలో ఒక మంచి సామాజిక మార్పుకు దోహదం చేసేవిధంగా కృషిచేయాలని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ, కరెస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ కళాశాలలో గతనెల 28న భారతప్రభుత్వం మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశానుసారం 'స్త్రీ పురుష సమానత్వం' అనే అంశంపై వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ స్వాగతించదగిన సామాజిక మార్పుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమం నిర్వహించిన ఛైర్‌పర్సన్, సిఎస్‌ఇ విభాగాధిపతి శ్రీమతి జాహ్నవి మాట్లాడుతూ, స్త్రీ పురుష సమానత్వం అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫీ అనే అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. అదేవిధంగా 'ఆధునిక సమాజంలో మహిళల ప్రాధాన్యత-హక్కులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించామని తెలిపారు. యస్ అండ్ హెచ్ విభాగాధిపతి శ్రీమతి కె.విజయ ఈ పోటీలను పర్యవేక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.సిహెచ్ కల్యాణి, శ్రీమతి ఎస్‌కెఎం షాహినా, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపి ఆర్ఎస్ఏ రాష్ట్ర సంఘంలో...

# నెల్లూరీయులు

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంతో పాటు రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గత నెల 29వ తేదీ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగాయి. ఈ సమావేశానికి నెల్లూరుజిల్లా నుంచి సంఘ జిల్లా, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, డివిజన్ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అంజి ప్రసాద్ ప్యానల్స్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈ ఎన్నికల్లో నెల్లూరుజిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర కమిటిలో చోటు కల్పించారు. వీరిలో ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న చొప్పా రవీంద్రబాబు(బుచ్చిరెడ్డిపాళెం తహశీల్దార్)ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గతంలో ఏపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి ప్రస్తుతం కలిగిరి తహశీల్దార్‌గా పనిచేస్తున్న పి.జనార్ధన్‌రావును రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటికి ఎన్నికైన నూతన కార్యవర్గసభ్యులను విజయవాడలోనే జిల్లా రెవెన్యూ ఉద్యోగులు తరఫున ఏపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ముత్యం నరశింహులు, ఎ.పెంచలరెడ్డి అభినందించారు.

## కన్నులపండువగా...



# 'కార్తీక' లక్షదీపోత్సవం

- పాల్గొన్న శ్రీ రాధాభారతీనందస్వామి - ప్రముఖదాత వేమిరెడ్డి దంపతులు
- వేలాదిమంది భక్తులతో... క్రిక్కిరిసిన విఆర్‌సి మైదానం





అత్యంత పవిత్రమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని విఆర్‌సి మైదానంలో గత నెల 27 నుంచి 29వ తేది వరకు మూడురోజుల పాటు ఎంతో వేడుకగా కార్తీకమాస లక్ష దీపోత్సవం కార్యక్రమం జరిగింది. నిత్యం వేలాది మంది భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తితో పరవశించిపోయారు. శివనామ స్మరణలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోయింది. నెల్లూరులోని ప్రముఖదాత, వి.పి.ఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సహకారంతో జరిగిన ఈ ఆధ్యాత్మిక పండుగలో తొలుత గణపతి పూజ, గోపూజ, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి శివలింగ ప్రతిష్ట, కలశస్థాపన, లక్ష గాయత్రం మంత్రజపంతో పూజలు ప్రారంభం కాగా, కుర్తాళం పీఠాధిపతి శ్రీ రాధానందభారతిస్వామి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీ రాధానందభారతిస్వామితో కలసి వేదికపై కొలువుదీర్చిన కాశీవిశ్వనాధునికి అభిషేకాలు చేశారు. అనంతరం సప్తరుషుల పూజ నిర్వహించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహం అందరికీ కలగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆ భగవంతుని ప్రార్ధిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ప్రముఖదాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ఈ విశిష్ట పూజోత్సవాల సందర్భంగా ఎంతో విశాలమైన వేదిక నిర్మించి, కాశీక్షేత్రం సెట్టింగ్ వేసి, అత్యద్భుతమైన అలంకారాలతో, శోభాయమానమైన విద్యుద్దీపకాంతులతో వేదిక ప్రాంతాన్నంతా అలరింపజేశారు. మంగళవాయిద్యాలు, భక్తి సంకీర్తనలు, వేదపండితుల మంత్రోచ్చటనల మధ్య ఆద్యంతం ఈ మూడురోజుల పూజా కార్యక్రమాలు అశేష భక్తజనుల మధ్య భక్తిరసస్ఫోరకంగా సాగాయి. శివకేశవులిద్దరూ ఒకటే కనుక, ఈ వేదికపై కాశీ విశ్వేశ్వర పూజతోపాటు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాసునికి వేడుకగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. వేద పండితులు గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ, శరణ్‌స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం భక్తి సంగీత గాయకులు వినోద్‌కుమార్, గుండాల గురవయ్య శిష్యబృందం, హరిహరనాథ-ప్రసన్నాంజనేయస్వామి కోలాటాల బృందంవారు ప్రదర్శించిన భక్తిసంగీత కార్యక్రమాలు, కోలాటాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. రెండవ రోజు జరిగిన కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతుల సౌజన్యంతో 108 మంది దంపతులతో


(మిగతా 10వ పేజీలో)







87వ జయంతి



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

జననం: 08-11-1930 వ్యవస్థాపకులు మరణం: 18-01-1995

లాయర్
తెలుగు వారపత్రిక

## 'ప్రభా'తం

గుజరాత్ ఎన్నికలకు నగారా మోగింది. డిసెంబర్‌లో ఎన్నికలు. అంటే కేవలం నెలరోజులే ఉన్నాయి. డిసెంబర్ 9న ఒకసారి, 14న మరోసారి రెండు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 18న జరుగుతుంది.ఈ ఎన్నికలు నాయకులకు అగ్నిపరీక్ష కానున్నాయి. గుజరాత్‌లో బిజెపి అధికారంలో ఉంది కనుక, ఇక్కడ మళ్ళీ తమదే గెలుపనే ధీమాతో ఉంది. మొత్తం 33 జిల్లాలున్న గుజరాత్ రాష్ట్రంలో 182 అసెంబ్లీ స్థానాలున్నాయి. తొలివిడతగా 89 స్థానాలకు సంబంధించిన 19 జిల్లాల్లోను, మలివిడతగా 93 స్థానాలకు సంబంధించిన 14 జిల్లాల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్‌లో మొత్తం 4,33,37,492 మంది ఓటర్లున్నారు. నవంబర్ 14 నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది. అదేవిధంగా నవంబర్ 9న హిమాచల్‌ప్రదేశ్‌కు ఎన్నికలు జరిగి, డిసెంబర్ 18న హిమాచల్‌ప్రదేశ్ ఓట్ల లెక్కింపుతోపాటే, గుజరాత్ ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుంది. ఆ రోజే రెండింటి ఫలితాలు వెలువడతాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో బిజెపి సీనియర్ నాయకుడు ప్రేమ్‌కుమార్ ధూమల్‌ను తాజాగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి అధిష్ఠానం ప్రకటించి ఎన్నికల రంగంలోకి దిగింది. దీంతో రెండు రాష్ట్రాల్లో ఎన్నికల కోలాహలం మిన్నంటుతోంది. అయితే, గుజరాత్‌లో మాత్రం గతంలో ఎన్నడూ లేనంత హోరాహోరీగా ఈసారి ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో ఇక్కడ రాజకీయం మరింత వేడెక్కింది. అధికారంలో ఉన్న బిజెపి తమ అధికారం నిలబెట్టుకోవాలని, అధికారం కోసం కాచుక్కూర్చున్న కాంగ్రెస్ ఈసారైనా ఇక్కడ తిష్టవేయాలని ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నాయి. దీంతో, అటు కమలం..ఇటు కాంగ్రెస్‌లకు ఈ ఎన్నికలు నువ్వా-నేనా అన్నంత ప్రతిష్ఠాత్మకంగా ఉన్నాయి. గతంలో గుజరాత్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. 1995 నుంచి ఇక్కడ బిజెపి హవా ప్రారంభమైంది. 1998 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిజెపి విజయం సాధించడంతో కమలం జెండా రెపరెపలాడింది. 2002, 2007 ఎన్నికల్లోనూ బిజెపిదే ఘనవిజయం. తొలుత అక్కడ కేశూభాయ్‌పటేల్ ముఖ్యమంత్రిగా ఉంటూ బిజెపికి సారథ్యం వహించినా, ఆ తర్వాతకాలంలో ఆ అవకాశం నరేంద్రమోడీకి దక్కడంతో మోడీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ఇక అక్కడి నుంచి మోడీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి గుజరాత్ ప్రజల మన్ననలు పొందడంతో, 2012 ఎన్నికల్లోనూ ఇక్కడ బిజెపియే అత్యధికస్థానాలను కైవశం చేసుకుంది. అలా..మోడీ ప్రధాని అయ్యేదాకా కూడా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ గుజరాత్‌ను అభివృద్ధిబాటలో నిలిపారు. అయితే, ఇప్పుడు జరుగనున్న ఈ ఎన్నికలు 2019లో రానున్న లోక్‌సభ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది కనుక, గుజరాత్‌లో విజయమే లక్ష్యంగా బిజెపి వ్యూహరచన చేస్తోంది. అందులోనూ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ త్వరలోనే పార్టీకి అధ్యక్షులు కానున్నారనే ప్రచారం నేపథ్యంలో, ఈ ఎన్నికలు ఆయనకు, మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింత సవాల్ కానున్నాయి. దీంతో, గుజరాత్ ఎన్నికలు అటు కమలం, ఇటు కాంగ్రెస్ అగ్రనాయకులకు అగ్నిపరీక్ష కానున్నాయి. పెద్దనోట్ల రద్దు ప్రభావం, అస్తవ్యస్తంగా ఉన్న జిఎస్టీ ఈ రెండూ కలసి బిజెపికి ఈ ఎన్నికల్లో చుక్కలు చూపిస్తాయన్నది కాంగ్రెస్‌వాదుల ఆశ. అందుకు తగ్గట్టుగానే పెద్దనోట్ల సంగతి ఎలా ఉన్నా, జిఎస్టీ మాత్రం అక్కడి ప్రజల్లో అధికశాతం వ్యాపారవర్గాల్లో అసంతృప్తినే రాజేస్తోందనే చెప్పవచ్చు. జిఎస్టీ వల్ల వ్యాపారాలు మందగించిపోతున్నాయన్నది సర్వత్రా వినపడుతున్న విమర్శే. అందులోనూ గుజరాత్‌లోని అనేకమంది చిన్న, మధ్యతరగతి వ్యాపారులు జిఎస్టీపై బాగా అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. వస్త్ర పరిశ్రమపై విధించిన అయిదుశాతం పన్నును రద్దుచేయాలని కూడా గత కొద్దికాలంగా అక్కడి వ్యాపారులంతా కోరుకుంటున్నారు. కానీ బిజెపి నేతలు వారి బాధలు పట్టించుకోకపోవడంతో వారంతా బిజెపి పట్ల అసంతృప్తితో ఉన్నారని, సరిగ్గా ఈ అంశమే తమకు మేలు చేస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. అందుకు తగ్గట్టుగా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ బిజెపికి ఈసారి ఇక్కడ విజయం దక్కకూడదనే పట్టుదలతో ఉన్నారు. పెద్దనోట్ల రద్దు, అస్తవ్యస్తంగా ఉన్న జిఎస్టీ విధానాలు ప్రజల్లో మోడీ పట్ల అసంతృప్తిని పెంచుతున్నాయని, దీంతో తమ పార్టీకి ఇక్కడ విజయం తప్పకుండా లభిస్తుందని ఆయన ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గుజరాత్‌లో గణనీయమైన సంఖ్యలో ఉన్న సామాజికవర్గాలను తమవైపునకు తిప్పుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ ఉన్న పటేళ్ళు, ఓబిసిలు, దళితుల ఓట్లు రాబట్టుకునేందుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. పటేళ్ళు..తమను ఓబిసిలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని గత రెండేళ్ళుగా గుజరాత్‌లో ఉద్యమాలు చేస్తున్నారు. అయినా బిజెపి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పటేళ్ళ వర్గం బిజెపికి దూరమవుతోందని, దీని ప్రభావం కూడా బిజెపిపై పడుతుందని, వీటన్నిటి పర్యవసానంగా తమకు ఈసారి గుజరాత్‌లో విజయం దక్కడం ఖాయమని కాంగ్రెస్ అంచనాలు వేసుకుంటోంది. అయితే, ఎవరెన్నుకున్నా గుజరాత్‌లో తమ స్థానం పదిలమని, అభివృద్ధి మంత్రమే తమపార్టీని గెలిపిస్తుందని బిజెపి గట్టి నమ్మకంతో ఉంది. కొంతమంది పటేళ్లు దూరమైనా, మరికొంతమంది ముఖ్యులైన పటేళ్ళను తమపార్టీలో కలుపుకుని బిజెపి మునుపటి ఉత్సాహంతోనే ఎన్నికల రంగంలోకి వస్తోంది. మొత్తమ్మీద గుజరాత్ ఎన్నికలు అటు కమలం, ఇటు కాంగ్రెస్ అగ్రనాయకులకు అగ్నిపరీక్షగా మారనున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోడీకి ఉన్న ప్రజాదరణ, అమిత్‌షా రాజకీయ చతురత ఈసారి గుజరాత్ ఎన్నికల్లో ఏమేరకు పనిచేస్తాయోనని రాజకీయవర్గాల్లో ఉత్కంఠగానే ఉంది. చివరికి ప్రజలు ఏపార్టీ వైపు మొగ్గుచూపి విజయాన్ని ప్రసాదిస్తారో మరి..వేచిచూడాల్సిందే!..

### అగ్రనాయకులకు అగ్నిపరీక్ష





డిసెంబర్‌లో జరుగనున్న గుజరాత్ ఎన్నికలు ఈసారి బిజెపి-కాంగ్రెస్ అగ్రనాయకులకు అగ్నిపరీక్ష కానున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలను కూడా వీటి ఫలితాలు ప్రభావితం చేసే అవకాశాలుండడంతో ఇక్కడ విజయం రెండు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. బిజెపి అగ్రనేత ప్రధాని మోడీ ప్రజాకర్షణ, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా రాజకీయచతురత ఒకవైపు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విమర్శలు, పెద్దనోట్ల రద్దు, జిఎస్టీల పట్ల వ్యతిరేకత ఇవొక వైపు. చివరికి విజయం ఎవరివైపో వేచిచూడాల్సిందే!..

## 12న చాచానెహ్రూ చెకుముకి అవార్డ్స్ ప్రతిభా పరీక్ష

నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటలకు చాచా నెహ్రూ చెకుముకి అవార్డ్స్, గుండాల లక్ష్మమ్మ, నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చాచానెహ్రూ చెకుముకి అవార్డ్స్ ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నట్లు సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు రావపాళెం రఘు, గుండాల నరేంద్రబాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బాలబాలికల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సహజ జ్ఞానం పెంపొందించుకునేందుకు పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, కళాశాల స్థాయిలో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు చాచా నెహ్రూ చెకుముకి అవార్డు-2017 ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు క్రింద వెయ్యి, ఏడు వందలు, అయిదు వందల రూపాయలు నగదును, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాలను విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్యచే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఇతర వివరాలకు 9493235992 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## కమనీయం.. శ్రీరంగనాథుని కల్యాణం

నెల్లూరు రంగనాయకులపేటలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో గత నెల 29న స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం, ఈ ఉత్సవంలో భాగంగా స్వామివారికి సంప్రదాయబద్ధంగా పూదత్తాళ్వార్ తిరుమంజనం నిర్వహించి అభిషేకం చేశారు. ఎంతో కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఆలయ ఇ.ఓ కోవూరు జనార్ధనరెడ్డి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

## ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా వేగూరు

నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా దేవాదాయశాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇ.ఓగా వున్న పులి కోదండరామిరెడ్డిని వివిధ రాజకీయ కోణాల నేపథ్యంలో బదిలీ చేశారు.

## బీసీలకు శిక్షణ

2017-18 సంవత్సరానికి న్యాయశాస్త్ర పట్టభద్రులైన బి.సి అభ్యర్థులకు మూడేళ్లపాటు న్యాయపరిపాలనలో శిక్షణ ఇవ్వనున్నట్లు బి.సి కార్పొరేషన్ ఇ.డి నరసారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వాళ్ళు 15వ తేదీ లోపు దరఖాస్తులను బి.సి. సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.




## చంద్రబాబును అతిగా నమ్మితే అంతే!

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడును నమ్ముకుంటే ఎర్రికైనా రేవంత్‌రెడ్డి గతే పడుతుంది. చంద్రబాబు, కేసీఆర్‌ల కుమ్మక్కు రాజకీయాలకు మధ్యలో బలైపోయింది రేవంత్‌రెడ్డే. ఓటు-నోటు కేసులో ప్రధానపాత్ర చంద్రబాబుదే! ఈయనను అతిగా నమ్మి ఓటు-నోటు కేసులో ఇరుక్కున్నాడు రేవంత్‌రెడ్డి. వాడుకుని వదిలేసే రకం చంద్రబాబు. ఆయనను అతిగా నమ్మితే అంతే సంగతులు.

**జి.ప్రకాశ్, నెల్లూరు.**

## కాంగ్రెస్ బుద్ధి మారదా?

దేశంలో మైనార్టీల మీద అతి ప్రేమను ఒలకబోస్తూ మెజార్టీ హిందువులను నిర్లక్ష్యం చేస్తూ రావడం వల్లే ఈరోజు కాంగ్రెస్ దీనావస్థలో ఉంది. ఒక్కో రాష్ట్రంలో తుడిచిపెట్టుకుపోతోంది. అయినా వాళ్ళకు ఇంకా బుద్ధి రావడం లేదు. కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించాలంటూ ఆ పార్టీ నాయకుడు చిదంబరం ప్రకటన చేయడం శోచనీయం. కాశ్మీర్‌ను కాంగ్రెస్‌వాళ్ళు ఇప్పటికే తగలబెట్టారు. ఇంకా అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. కాశ్మీరేమీ పాకిస్థాన్‌లోని భాగం కాదు. ఇండియాలో భూభాగం. ప్రత్యేకకాశ్మీర్ కావాలనుకునేవాళ్ళు ఆ ప్రాంతాన్ని విడిచి పాకిస్థాన్‌కో, బంగ్లాదేశ్‌కో వెళ్ళిపోవచ్చు.

**సి.రాజీవి, నెల్లూరు.**

## పారిశుద్ధ్యం పనులు చూడండి

నెల్లూరు కార్పొరేషన్ పాలకులు ప్రజలకు ఏది అవసరమో దానిపై దృష్టి పెట్టడం లేదు. వాళ్లకు డబ్బులు వేటిల్లో వస్తాయో వాటి మీదే దృష్టి పెడుతున్నారు. రొట్టెల పండుగలు, డివైడర్లంటూ కోట్లు తగలేస్తున్నారు. ఈ డబ్బులతో ప్రతివీధిలోనూ చెత్త తొట్టెలు పెట్టొచ్చు. పారిశుద్ధ్య కార్మికులను పెంచి ప్రతి వీధిని శుభ్రంగా ఉంచొచ్చు. మురికి కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి దోమలు పెరగకుండా చూడొచ్చు. చెత్త ట్రాక్టర్లను పెంచి, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించవచ్చు. పారిశుద్ధ్యం ఛండాలంగా ఉండబట్టే కదా నగరం నిండా దోమలు... ఊరి నిండా జ్వరాలు... వీళ్ళు ఎప్పటికి మారుతారో ఏమో?

**- పావిడి నరసింహమూర్తి, నెల్లూరు.**

## మహాఉదారురాలు రుక్మిణమ్మ

కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు మహాఉదారురాలు. ఏటా మా సేవా సమితి నిర్వహించే బీదలకు కొత్త దుప్పట్ల పంపిణీకి ఆమె తప్పక ప్రతి సంవత్సరం చాలా కొత్త దుప్పట్లను తెప్పించిపెట్టి మాకు అందించేది. ఆమె తృతీయ వర్ధంతి సందర్భంగా మా సేవాసమితి తరఫున నేను ప్రగాఢ సానుభూతిని, నివాళులను అర్పిస్తున్నాను.

**యస్.వి.నరసింహారావు, స్థాపక కార్యదర్శి,**
**శ్రీరామకృష్ణ సేవాసమితి, నెల్లూరు.**

# మళ్ళీ చెడింది




**నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున! మేయర్ అయిన కొన్ని నెలలకే చేసిన ప్రమాణాలను పక్కనపెట్టేసి, తన వర్గం వారి మనో భావాలను వెనక్కి నెట్టేసి, వైసిపిని వదిలేసి సైకిలెక్కేసాడు. మేయర్ అజీజ్ తెలుగుదేశంలోకి రావడానికి ప్రధాన కారణం మంత్రి నారాయణ.**

మేయర్ ఎలక్షన్‌కు ముందే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. మంత్రి నారాయణ అనుకుని వుంటే అప్పుడే మేయర్‌గా తమ పార్టీ వాళ్ళను చేసుకుని వుండొచ్చు. కాని, మేయర్ ఎలక్షన్‌కు ముందే అజీజ్‌తో ఆయన ఒప్పందం చేసుకున్నాడు. మేయర్‌గా గెలిచాక తెలుగుదేశంలో చేరాలని మాట్లాడుకున్నారు. అందుకనే అప్పుడు నారాయణ నెల్లూరు మేయర్ ఎన్నికల్లో పెద్ద టెన్షన్ పడలేదు. పెద్దగా రిస్క్ తీసుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం అజీజ్ మేయర్‌గా ఎన్నికయ్యాక తెలుగుదేశంలో చేరాడు. అయితే మంత్రి నారాయణ, మేయర్ అజీజ్‌ల మధ్య అప్పుడప్పుడూ బేధాభిప్రాయాలు తలెత్త సాగాయి. నారాయణ మున్సిపల్ మంత్రి కావడం, నెల్లూరు సొంతూరు కావడంతో స్వతహాగానే ఈ కార్పొరేషన్ వ్యవహారాలలో నారాయణ ప్రత్యక్షంగా జోక్యం చేసుకోసాగాడు. కార్పొరేటర్లు, అధికారులు కూడా నేరుగా మంత్రితోనే టచ్‌లో ఉండసాగారు. మొదటి మొదట్లో నారాయణ, అజీజ్‌ల బంధం బాగానే కొనసాగింది. అజీజ్ మాటకు ప్రాధాన్యత వుండేది. ఆయన చెప్పినట్లే అధికారుల బదిలీలుండేవి. ఆయన కోరిన వాళ్ళే కమిషనర్‌లుగా వచ్చే వాళ్ళు.

అయితే రానురాను అజీజ్‌పై నారాయణకు సదాభిప్రాయం తగ్గిపోయినట్లుగా కనిపిస్తోంది. కార్పొరేషన్‌లో అవినీతి పెరిగిపోయింది. కేవలం ధనార్జన కోసమే కొన్ని పనులు చేస్తున్నట్లుగా వుంది. మేయర్‌పై లెక్కలేనన్ని ఆరోపణలు రాసాగాయి. దీనికితోడు అజీజ్ వ్యతిరేక కార్పొరేటర్లందరూ సిండికేట్ అయ్యారు. నెల్లూరు నగరంలో ప్రధాన నాయకులైన ఆనం, సోమిరెడ్డి, ఆదాల... వీళ్లెవరితోనూ అజీజ్‌కు సఖ్యత లేకుండా పోయింది. అజీజ్ వ్యవహారశైలితో పార్టీకి నష్టమని భావించిన మున్సిపల్ మంత్రి నారాయణ ఆయనకు ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చాడు. ఆయనకు ఇష్టం లేకుండానే నగర పాలక కమిషనర్‌గా ఢిల్లీరావును తెచ్చారు. ఆయనకు ఫుల్‌పవర్ ఇచ్చారు. మేయర్ ప్రమేయం లేకుండానే, ఆయన ఒత్తిళ్ళు లెక్కచేయకుండానే నగరంలో కమిషనర్ తన పని తాను చేసుకుపోతున్నాడు. ఇది అజీజ్‌కు మింగుడుపడడం లేదు. ఆక్రమణల తొలగింపు విషయంలో అజీజ్ సిఫార్సులను కమిషనర్ ఖాతరు చేయలేదు.

కార్పొరేషన్‌లో కావాలనే తన పవర్ తగ్గిస్తున్నారని అజీజ్‌కు అర్ధమైంది. అదీగాక వచ్చే ఎన్నికల్లో నెల్లూరు నగరం నుండి పోటీ చేయాలని అజీజ్‌కు ఉబలాటంగా వుంది. నెల్లూరు నుండి తాను పోటీ చేయొచ్చని ప్రకటించి నారాయణ అజీజ్‌కు షాకిచ్చాడు. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రికి అజీజ్ దూరంగా వుంటున్నాడు. ఆయన కార్యక్రమాలలో కనిపించడం లేదు. నారాయణ కూడా అజీజ్ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదు. ఆయన పని ఆయన చేసుకుపోతున్నాడు. ఈ వ్యవహారం ఎక్కడిదాకా పోతుందో చూడాలి!

# బీళ్ళకు నీరు... పండాలి పైరు!

## ఐఎబిలో ఖరారైన నీటి పంపకం




ఎట్టకేలకు నీటి లెక్కలు తేలాయి. ఎంత పంట వేయాలన్నది తేల్చారు. అక్టోబర్ 28న నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి పి.అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, బొల్లినేని రామారావు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఇరిగేషన్ అధికారులు హాజరయ్యారు. సోమశిల రిజర్వాయర్‌లో 50టీఎంసీల నీళ్ళు చేరడంతో ఈ సంవత్సరమైనా రైతులను సంతృప్తి పరిచే విధంగా నీళ్లిద్దామని ఈ సమావేశం ఏర్పాటు చేసారు. జిల్లాలోని అన్ని కాలువల క్రింద 4.92 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం సోమశిలలో వున్న 50టిఎంసీలు, కండలేరులో వున్న 10టిఎంసీలతో పాటూ నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసే వర్షాల ద్వారా మరో 12టిఎంసీల దాకా వస్తాయని అంచనా వేసి నీటి పంపకాలను నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లలో డెడ్‌స్టోరేజీ, తాగునీటి అవసరాలను మినహాయించి మిగిలిన నీటిని ఆయకట్టుకే ఇవ్వాలని తీర్మానించారు. ఏ కాలువ క్రింద ఎంత ఆయకట్టు వుంది, ఎంత నీళ్ళు కావాలన్నది లెక్కలు వేసి పంపకాలు చేశారు.

గత ఏడాది సోమశిల నీటి పంపిణీలో అక్రమాలు జరిగినట్లు, కొందరు రైతుల వద్ద డబ్బులు దండి కొన్ని కాలువలకు అదనంగా నీటిని వదిలినట్లు ఇరిగేషన్ సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. ఈసారి అలాంటి తప్పులకు తావులేకుండా జాగ్రత్తగా నీటిని పంపిణీ చేయాలి.

# టిక్కెట్ ఖరారు చేసేదెవరు?

## కావలి రాజకీయం రసవత్తరం





నెల్లూరుజిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో టిక్కెట్ యుద్ధానికి తొలి వేదికగా మారింది కావలి నియోజకవర్గం. సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మళ్ళీ పోటీకి సమాయత్తం అవుతుండగా, ఈసారి మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణు వర్ధన్‌రెడ్డి కూడా రంగంలోకి రావడంతో సీన్ రసవత్తరంగా మారింది. ఏదైనా జగన్‌తోనే తేల్చుకుంటానంటూ ఇటీవల కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో జగన్‌తో భేటీ అయ్యాడు. కావలి సీటు విషయమై గట్టిగానే అడిగాడు. జగన్ ఆయనకు హామీ అయితే ఇవ్వలేదుగాని పరిశీలిద్దామని చెప్పినట్లు తెలుస్తోంది. కావలి సీటును విష్ణు గట్టిగా అడిగాడని తెలిసేసరికి ప్రతాప్ ట్రాక్‌లోకి వచ్చాడు. నేను సిటింగ్ ఎమ్మెల్యేను, నాకు సీటు వుందో లేదో తేల్చండి... నా పని నేను చూసుకుంటానని డోసు పెంచి చెప్పాడు. దీంతో ఓ పక్క ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మరో పక్క పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు కావలి సీటు సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌దేనని, జగన్ నుండి తమకు ఆ విధంగా సందేశం వచ్చిందని చెప్పారు. ఇక్కడితో ప్రతాప్ కూల్ అయ్యాడు. రాష్ట్రంలో ఇంతవరకు ఏ సీటు ఎవరిదన్నది ఖరారు కాలేదు. అప్పుడే చేయలేరు కూడా! ప్రతి నియోజకవర్గంలోనూ ప్రశాంత్‌కిషోర్ బృందం సర్వే జరుగుతోంది. ఏ నియోజకవర్గం నుండి ఎవరు బెటరో ఆ సర్వేలో తేలుతుంది. సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలందరికీ తిరిగి సీట్లు ఇచ్చినా వారిలో కొందరు గెలుస్తారనే నమ్మకం లేదు. అంతెందుకు నెల్లూరు సిటింగ్ ఎంపీ మేకపాటికి మళ్ళీ సీటిస్తే... గెలుపు డౌటే... కాబట్టి ఇప్పుడు ఎవరికి సీటు ఖరారు చేసారని చెప్పినా అది కంటి తుడుపు చర్యేగాని, బి-ఫారాన్ని చేతికిచ్చినట్లు మాత్రం కాదు.

# ఆ నాయకుడి పద్ధతి బాగలేదు!



## - నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

జిల్లాలో సమర్ధవంతంగా పనిచేస్తున్న ఎస్పీ రామకృష్ణపై విమర్శలు చేయడం పద్ధతి కాదని పరోక్షంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణనుద్దేశించి బీజేపీ సమన్వయ కమిటి సభ్యులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గత నెల31వ తేదీ ఆయన నెల్లూరు, పొదలకూరురోడ్డులోని తన ఇంట్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీగా వచ్చిన రామకృష్ణ నిజాయితీగా పనిచేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్నారు. బెట్టింగ్, ఎర్రచందనం, ఇసుక అక్రమరవాణాలపై చర్యలు తీసుకుంటున్నారు. నేరాలను అరికట్టేందుకు, బాధితులకు సత్వరన్యాయం అందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. జిల్లాకు పనిచేసే ఒక మంచి ఆఫీసర్ వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులు ఆయనకి సహకరించాల్సిందిపోయి, ఆయనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ ఎమ్మెల్యే రామకృష్ణకు చురకలంటించారు. వెంకటగిరిలో రోడ్డు విస్తరణ నెపంతో మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించే విషయంలో ఈ నాయకుడు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా వుందని ఆయన విమర్శించారు.


## ఉత్తరక్రియలు



మా ఇంటి దీపం

**శ్రీమతి పొత్తూరి నిర్మల గారు**

(W/o. డా॥ పి.మోహన్‌రావు,
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, నెల్లూరుజిల్లా)

తేది. 22.10.2017 ఆదివారం స్వర్గస్తురాలైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

తల్లి : పెంటేల సరోజనమ్మ

కుమారులు - కోడళ్ళు:
పొత్తూరి రవిప్రసాద్ - ఆసిక
పొత్తూరి రామప్రసాద్ - దీప్తి
మనుమరాలు : పొత్తూరి అక్షర సాయిమీనాక్షి
తమ్ముళ్ళు - మరదళ్ళు:
పెంటేల రమేష్‌బాబు - అనంతలక్ష్మి
పెంటేల శ్రీనివాసరావు - ఆదిలక్ష్మి

ఉత్తరక్రియలు: తేది. 5.11.2017 ఆదివారం శిలోద్వాసన
తేది. 6.11.2017 సోమవారం పొత్తర్లు, సపిండీకరణము, వైకుంఠ సమారాధన
నెల్లూరు టెక్కేమిట్టలోని 107 నలంద అపార్ట్‌మెంట్‌లో జరుగును. కావున తెలియజేయడమైనది.

## ఆపరేషన్ చేయించుకుంటే...

# కత్తెర ఫ్రీ

### పెద్దాసుపత్రి వారి బంపర్ ఆఫర్



*అన్నీ ఉన్నా ప్రభుత్వాసుపత్రులలో వేషంట్లు వుండరు... ఉచితంగా వైద్యం చేస్తున్నా అక్కడకు వెళ్లరు... మరి వేలకు వేలు ఫీజులు గుంజుతున్నా ప్రైవేట్ ఆసుపత్రులు పేషంట్లతో కిటకిటలాడుతుంటాయి. ఎందుకు ఈ తేడా అంటే... చూపించ దానికి ఎన్నో ఉదాహరణలుంటాయి. అలాంటి ఉదాహరణకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే సంఘటన నెల్లూరులోని పెద్దాసుపత్రిలో చోటు చేసుకుంది.*

పెద్దాసుపత్రికి ఇటీవల పెద్దపెద్ద భవంతులు కట్టి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అని పేరు పెట్టారు. కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా భవనాలున్నాయి. అయితే ఇక్కడ వైద్యం మాత్రం ఆ స్థాయికి ఇంకా ఎదగలేదనిపిస్తోంది. రోగుల ప్రాణాలతో చెలగాటం సాధారణం అయ్యింది. వివరాలలోకి వెళితే... నెల్లూరురూరల్ మండలం కొత్త కాలువ సెంటర్‌కు చెందిన చలపతి కడుపునొప్పితో అక్టోబర్ 2న పెద్దాసుపత్రికి వచ్చాడు. అతనికి పరీక్షలు నిర్వహించి, పక్కరోజు 3వ తేదీన అసిస్టెంట్ సర్జన్ పద్మశ్రీ అతనికి ఆపరేషన్ చేశారు. డిశ్చార్జ్ అయ్యి మళ్ళీ ఇంటి కెళ్లాక తిరిగి కడుపునొప్పి తీవ్రంగా రాసాగింది. దీంతో అతను తిరిగి 27వ తేదీ పెద్దాసుపత్రికి వచ్చాడు. ఆరోజు డ్యూటీలో వున్న డాక్టర్ నాగేశ్వరరావు అతనికి ఎక్స్‌రే తీయించాడు. ఆ ఎక్స్‌రే చూసిన వైద్యులు నిర్ఘాంతపోయారు. ఎక్స్‌రే ద్వారా కడుపులో కత్తెర ఉన్నట్లు గుర్తించారు. 28వ తేదీన సర్జన్‌లు శ్రీలక్ష్మి, సుదీప్‌లు మళ్ళీ ఆపరేషన్ చేసి కత్తెర బయటకు తీసి కుట్లు వేశారు. 3వతేదీన ఆపరేషన్ చేసిన డాక్టర్లు అతని కడుపులోనే కత్తెర వుంచి మరచిపోయినట్లుగా తెలుస్తోంది. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ వైద్యసంస్థలు ఎలాగూ వ్యాపారమయ్యాయి. పేద రోగులకు అవి అందనంత ఎత్తులో వున్నాయి. ఏ దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కంటారు. ప్రస్తుతకాలంలో ఏ దిక్కులేని వాళ్ళే ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. అలాంటి వాళ్ళకు ప్రభుత్వ వైద్యులే దేవుళ్ళు. అలాంటి దిక్కులేని వారి పట్ల ప్రేమతో వైద్య సేవలందించాలి. ప్రభుత్వాసుపత్రిని మీ సొంత ప్రైవేట్ క్లినిక్ అనుకుని వైద్యసేవలందించండి. ఖచ్చితంగా పేదరోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరు చిత్తడి చిత్తడి



గత కొన్నిరోజులుగా కురిసిన వర్షాలకు నెల్లూరు నగరం చిత్తడి చిత్తడిగా మారింది. వర్షాలు కురుస్తున్నందుకు జనం ఓ పక్క సంతోషపడుతున్నా, బయటకొస్తే రోడ్లు మాత్రం నరకం చూపిస్తున్నాయి. మొన్నటి దాకా వానలు డివిజన్ల వారీగా కురిసాయి. మాగుంట లే అవుట్‌లో వానపడుతుంటే అదే సమయంలో వేదాయపాలెంలో ఎండ కాస్తుంటుంది. ఈ టైపు వానలే నగరంలో పడ్డాయి. గత నాలుగురోజుల పాటు జడివాన బాగానే పట్టింది. నగరానికి నీటి కొరత తీరినట్లే! కాకపోతే భూగర్భ డ్రైనేజీ కోసం తవ్విన రోడ్లతో జనం నానా తిప్పలు పడుతున్నారు. పలు చోట్ల తవ్విన రోడ్ల మధ్యలో వాహనాలు దిగబడిపోయి జనం మాకు ఈ భూగర్భ డ్రైనేజీ వద్దురా బాబు అనే పరిస్థితి వచ్చింది.

## బి.ఇ.డి కాలేజీ ప్రిన్స్‌పాల్‌గా మువ్వా

జిల్లా విద్యాశాఖాధికారిగా వుంటూ అవినీతి ఆరోపణలపై ఇటీవలే ప్రభుత్వానికి సరెండరైన మువ్వా రామలింగంను నెల్లూరులోని బి.ఇ.డి కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈమేరకు విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

## క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో...

# నాలుగో నగర పోలీస్‌స్టేషన్

నెల్లూరు నాలుగో నగర పోలీస్‌స్టేషన్‌ను పొదలకూరు రోడ్డులోని క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. దీనికిగాను 30వ తేదీన ఇక్కడ పోలీసుస్టేషన్ భవనాల నిర్మాణానికి ఏఎస్పీ శరత్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ మురళీకృష్ణ, నాలుగోనగర సి.ఐ సుధాకరరెడ్డిలు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం నాలుగోనగర పోలీసుస్టేషన్ విఆర్‌సి సెంటర్ వద్ద వుంది. గతంలో నాలుగోనగర స్టేషన్‌గా వున్న భవనాన్ని మహిళా పోలీసుస్టేషన్‌కు కేటాయించి, వెనుక వైపు కట్టిన భవనంలోకి పోలీసుస్టేషన్‌ను, సి.ఐ కార్యాలయాన్ని మార్చారు. అయితే ఈ భవనం ఇరుకుగా వుండడం, సిబ్బందికి, అధికారులకు తగినట్లుగా లేకపోవడం, లాకప్ సమస్యగా వుండడంతో ఎస్పీ రామకృష్ణ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంటనే స్పందించి క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో స్థలం కేటాయించడంతో ఇక్కడ పోలీసుస్టేషన్ నిర్మాణం చేపట్టారు. కలెక్టర్ బంగ్లా, ఎస్పీ క్యాంప్ కార్యాలయం, బారాషహీద్ దర్గా, పోలీసు కార్యాలయాలకు దగ్గరలో ఈ పోలీసుస్టేషన్ ఏర్పాటు కానుంది. ముఖ్యంగా నెల్లూరు కార్పొరేషన్ ఆఫీసు, జడ్పీ ఆఫీసులకు మధ్యలో వుండబోతోంది. ఈ రెండు చోట్లా కౌన్సిల్ సమావేశాలప్పుడు సభ్యులు ఎప్పుడు తన్నుకున్నా పోలీసులు క్షణాల్లో పరుగెత్తడానికి సౌకర్యంగా వుంటుంది.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.3లక్షల విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి బట్టేపాటి శ్రీనివాసులు, స్నేహలత దంపతులు గత నెల 28వ తేదీ రూ.3లక్షల విరాళాన్ని ఆసుపత్రి కన్వీనర్‌కు అందజేశారు. పేదరోగులకు ఎంతో బాసటగా ఉన్న ఈ ఆసుపత్రికి భవిష్యత్తులోనూ తమవంతు సహాయసహకారాలు అందజేస్తామని దాతలు తెలిపారు.

# యోగాలో 'విపిఆర్ విద్యా'ర్థిని ప్రతిభ

- అంతర్‌జిల్లా యోగా పోటీల్లో ప్రథమస్థానం



నెల్లూరు, గొలగమూడిరోడ్‌లో విపిఆర్ ఫౌండేషన్ స్థాపించిన 'విపిఆర్ విద్య' ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముద్దాలి దేవకి అంతర్‌జిల్లా యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించి అందరి ప్రశంసలందుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఇటీవల నిర్వహించిన 63వ అంతర్‌జిల్లా యోగ పోటీల్లో అండర్ -14 విభాగంలో దేవకి పాల్గొని ప్రథమ స్థానం సాధించింది. దీంతో నవంబర్‌లో చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు దేవకి ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థిని ప్రథమస్థానం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆ విద్యార్థినిని అభినందించారు. యోగాతో ఆరోగ్యం ఎంతో ఉల్లాసంగా ఉంటుందని, క్రీడలు శారీరకంగాను మానసికంగాను ఉత్తేజవంతులను చేస్తాయని వారు ఈ సందర్భంగా అన్నారు. ప్రపంచస్థాయిలో భారతీయ యోగాను గుర్తించి ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదిని యోగ దినోత్సవంగా ప్రకటించిందని, దీంతో ప్రపంచంలోని అన్ని దేశాలు కూడా భారతీయ యోగాను అభ్యసిస్తున్నాయని, ఇదెంతో సంతోషకరమైన విషయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య నారాయణరెడ్డి, విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో పాటు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాళ్ళు సెలవు పెడితే

# వీళ్ళే...!

జిల్లాలో ఐదు పోలీసు సబ్‌డివిజన్‌లకు ఐదుగురు ఇన్‌ఛార్జ్ డిఎస్పీలను నియమిస్తూ జిల్లా ఎస్పీ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డిఎస్పీలు సెలవు మీద వెళ్లినప్పుడు ఆటోమేటిక్‌గా వీళ్ళు ఇన్‌ఛార్జ్ డిఎస్పీలుగా వ్యవహరిస్తారు. నెల్లూరు నగరంకు సి.సి.ఎస్ డిఎస్పీ ఎం.బాల సుందరంను, నెల్లూరురూరల్‌కు ఎస్సీ, ఎస్టీ సెల్-2 డిఎస్పీ ఎన్.సుధాకర్‌ను, కావలికి ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీ ఇ.శ్రీనివాసులను, గూడూరుకు మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పీ కె.శ్రీనివాసాచారిని, ఆత్మకూరుకు ట్రాఫిక్ సి.ఐ ఎన్.రామారావును ఇన్‌ఛార్జ్ డిఎస్పీలుగా నియమించారు. రెగ్యులర్ డిఎస్పీలు వ్యక్తిగతంగా సెలవుపై వెళ్ళినా, లేదా విధి నిర్వహణలో బయట ప్రాంతాలకు వెళ్ళినా సదరు ప్రాంతాలలో పరిపాలనా నిర్వహణ సవ్యంగా ఉండాలనే ఇన్‌ఛార్జ్ డిఎస్పీలను నియమించినట్లు తెలుస్తోంది.

# లాయర్ గంగాధర్‌రెడ్డికి సత్కారం



సీనియర్ లాయర్ పెనుబాక గంగాధర్‌రెడ్డిని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ ఘనంగా సత్కరించారు. ఇటీవల నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లాయర్ గంగాధర్‌రెడ్డి పాల్గొని వీలునామా ఆవశ్యకతపై మాట్లాడుతూ కష్టార్జితాన్ని తమ కుటుంబాలకు, నచ్చినవారికి సంక్రమింపజేసేందుకు, ఆస్తుల పంపకాలకు వీలునామా ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. వీలునామా ద్వారా ఆస్తులు చట్టబద్ధంగా పిల్లలకు సంక్రమిస్తాయన్నారు. వీలునామా ద్వారా ఆస్తులే కాకుండా సభ్యత్వాలు, హక్కులను బదలాయించే అవకాశం ఉందన్నారు. వీలునామాను ఇద్దరు సాక్షుల సమక్షంలో తగు రుసుము చెల్లించి రిజిష్టర్ చేయించడం తప్పనిసరన్నారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు నూకల శేషయ్య గుప్తా, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీధరరావు, అమృత సుబ్రహ్మణ్యం, బి.వి.వి.సత్యనారాయణ, బి.మురళీకృష్ణ, బసవయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతికతతో ముందుకు సాగాలి



విద్యార్థులు భవిష్యత్తును అంచనా వేసుకుని సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకుసాగాలని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బాబుజాకబ్ పేర్కొన్నారు. గత నెల 29వ తేదీ నెల్లూరు విశ్వసాయి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సరికొత్త విధానాలతో విశ్వసాయి విద్యాబోధన చేస్తుండటం అభినందనీయమని, ఇంతమంది మెడికల్ సీట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. విశ్వసాయి కళాశాల ఛైర్మెన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఒత్తిడి లేని బోధనతో సరళమైన ప్రణాళికతో ముందుకెళితే మంచి ఫలితాలు సాధించగలమని సూచించారు. అనంతరం మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించి ప్రతిభా పురస్కారాలను అందజేసారు. డివిఇవో పరంధామయ్య, కళాశాల వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ శ్రీరాములురెడ్డి, డిజిఎం నరేష్, అధ్యాపకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పని చేసేవాళ్ళు వీళ్ళకు పనికిరారు

- 'దేశం' నేతలకు మింగుడుపడని ఎస్పీ రామకృష్ణ
- బదిలీ చేయకుంటే పార్టీకే నష్టమంటూ అధికార నేతల ఆందోళన

అధికారులు మూడు రకాలుగా వుంటారు. ఒకరు అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతుంటారు. వీళ్ళనే బూట్లు నాకేవాళ్ళు అని కూడా అంటుంటారు. ఇంకోరకం... అధికార పార్టీవాళ్ళనే ఉచ్చపోయించే వాళ్ళు. వీళ్ళు మహా ముదుర్లు. ఇకపోతే మూడోరకం... చట్ట ప్రకారం, నిబంధన ప్రకారం పని చేసుకుంటూ పోయేవాళ్ళు. తమ బూట్లు నాకే వాళ్ళతో అధికారపార్టీ వాళ్ళకు ఇబ్బంది ఉండదు. లేదా తమకు పూర్తి వ్యతిరేకంగా పనిచేసే అధికారులతోనూ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే అలాంటివాళ్ళను ముందుగానే గుర్తించి లూప్‌లైన్లలో తోస్తుంటారు. అధికారపార్టీ వాళ్ళకు అసలు సమస్యల్లా చట్ట ప్రకారం ముక్కుసూటిగా పనిచేసుకుపోయే వాళ్ళతోనే! ఇలాంటి వాళ్ళు ఎవరి మాటా వినరు. అధికారపార్టీ నాయకుల పనులన్నీ కూడా కొంతవరకు చట్ట విరుద్ధంగానే వుంటాయి. ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఇసుకట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుంటారు. ట్రాక్టర్ ఓనర్ వెళ్ళి... అధికారపార్టీ నాయకులకు... ట్రాక్టర్ నా జీవనాధారమని, దానిని విడిపించమని మొరపెట్టుకుంటాడు. ఇక్కడ అధికార పార్టీ నాయకుడికి అగ్ని పరీక్షే. నిబంధనలను అతిక్రమించిన ట్రాక్టర్‌ను వదలమని ఎస్పీకి చెప్పాలంటే భయం. అలాగని ట్రాక్టర్‌ను వదిలించకుంటే... నువ్వేమీ నాయకుడివని జనం నవ్విపోతారని ఇంకో భయం.

ప్రస్తుతం ఇలాంటి స్థితిలోనే నెల్లూరు జిల్లా తెలుగుదేశం నాయకులున్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ వారికి మింగుడుపడని జడపదార్ధంగా మారాడు. రామకృష్ణ వచ్చినప్పటి నుండి బెట్టింగ్, ఎర్రచందనం, మైనింగ్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాడు. మైనింగ్‌పై పూర్తిగా నిఘా పెట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటుండడంతో అధికారపార్టీ నాయకులకు ఊపిరాడడం లేదు. ఈమధ్య ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం ఎక్కువైంది. అలాగే నిబంధనలను ఉల్లంఘించి తిరుగుతున్న ఆటోలను కూడా పెద్దసంఖ్యలో సీజ్ చేస్తున్నారు. వీళ్ళంతా కూడా తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వీళ్ళు ఎస్‌ఐలకు, సిఐలకు ఫోన్‌లు చేస్తున్నారు. వాళ్ళేమో మా చేతుల్లో ఏమీ లేదు, ఎస్పీకి చెప్పమంటున్నారు. ఎస్పీకి ఇలాంటి పనుల కోసం ఫోన్‌లు చేయలేకపోతున్నారు. వీటి కోసం ఫోన్ చేస్తే ఆయన నుండి ఎలాంటి సమాధానం వస్తుందో వీరికి తెలుసు. అందుకే క్రింది స్థాయిలో పనులు కాక, పైస్థాయి అధికారికి చెప్పే ధైర్యం లేక, అసలు ఎస్పీనే మారిస్తే పోలా అనే పరిస్థితికి వచ్చారు.

ఇటీవల నెల్లూరులో జరిగిన తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటి సమావేశంలో ఎస్పీ అంశాన్నే ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్‌నాథ్ రెడ్డిల సమక్షంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్‌లు ఎస్పీ వ్యవహారశైలిపై గట్టిగా మాట్లాడారు. ఆయనను ఎస్పీగా కొనసాగిస్తే నియోజకవర్గాలలో తమకు ఓట్లు పడవన్నట్లుగా వాపోయారు. ఎస్పీ అయినా మారాలని, లేదంటే ఎస్పీనైనా మార్చాలని, మంత్రులు ఆ పని చేయకుంటే ముఖ్యమంత్రి వద్దే దీనిపై పంచాయితీ పెడతామని వార్నింగ్ ఇచ్చారు.

'విక్రమార్కుడు' సినిమాలో హీరో రవితేజ డైలాగ్... పోలీసోడు ట్రాన్స్‌ఫర్ అయితే పోలీస్‌స్టేషన్‌కే పోతాడు, రైల్వే స్టేషన్‌కు కాదు... ఇప్పుడు రామకృష్ణను బదిలీ చేసి ఇంకో జిల్లాలో వేసినా అక్కడ అధికార పార్టీ నాయకులదీ ఇదే పరిస్థితి. తమ మాట వినలేదని ట్రాన్స్‌ఫర్లు చేసుకుంటూ పోతే ప్రజల కోసం పనిచేసే అధికారులే మిగలరు. అధికార పార్టీ నాయకులు వారివైపు నుండి ఆలోచించడం మాని కొంచెం చట్టం వైపు నుండి కూడా ఆలోచించడం నేర్చుకోవాలి.

# 'రైతు రథం'తో అభివృద్ధి పథం

**- మంత్రులు అమర్‌నాథరెడ్డి, సోమిరెడ్డి**




రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి, కరువు పీడిత జిల్లాల్లో రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గతనెల 28న పురపాలక మంత్రి నారాయణతో కలిసి, ముగ్గురు మంత్రులు నెల్లూరులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 40 మంది రైతులకు రైతురథం పథకం కింద ట్రాక్టర్లను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు రుణమాఫీతో పాటు, అదనంగా పదిశాతం వడ్డీ కూడా కలిపి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా, 200 కోట్లతో రైతు రథం కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అదేవిధంగా, ఉద్యానపంటల అభివృద్ధికి డ్రిప్ ఇరిగేషన్ వగైరాల ఏర్పాటుకు 1127 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. మంత్రి డా. పి.నారాయణ మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పాశం సునీల్‌కుమార్, టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, కిలారి వెంకట స్వామినాయుడు తదితరులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మూడున్నరేళ్ళుగా మాయమాటలేనా?...

**- టిడిపిపై ఎమ్మెల్యే అనిల్ మండిపాటు**



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి గత మూడున్నరేళ్ళుగా ప్రజలకు మాయమాటలు చెప్తూ నయవంచన చేస్తోందని, ఉత్తుత్తి హామీలు, బోగస్ లెక్కలతో ప్రజలను మభ్యపెడుతోందని నెల్లూరు ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్ మండిపడ్డారు. ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా గతనెల 29న ఆయన 3వ డివిజన్‌లోని సౌదావారి పాళెం, దస్తగిరినగర్‌లలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమకు తాగడానికి మంచినీళ్ళు కూడా సక్రమంగా రావడం లేదని, అదేవిధంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ఇక్కడి స్థానికులు తమకు తెలియజేశారని, వారి సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. పలు ప్రాంతాల్లో జన్మభూమి కమిటీల వల్ల అర్హులైన వారికి పింఛన్లు రావడం లేదని ఆయన విమర్శించారు. కమిటీలతో సంబంధం లేకుండా అర్హులైనవారందరికీ పింఛన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఎంతోమంది పేదలకు అభివృద్ధి ఫలాలు అందాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల బాధలు తొలగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, సంక్రాంతి కల్యాణ్, మల్లికార్జునరావు, ఎస్.నాగరాజు, వెంకట్రావు, సంక్రాంతి వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# కార్పొరేట్‌ల మధ్య ఫైట్

**ర్యాంకర్ల కోసం పోటాపోటీ**

## శ్రీచైతన్య నారాయణ

*భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ చదువులు ఇంకా బ్రతికేవున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల కంటే అవి ఘనమైన ఫలితాలనే సాధిస్తున్నాయి. తమిళనాడులోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీటు దొరకాలంటే ఇప్పటికీ గగనమే!*

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ చదువులు ఏనాడో తుప్పుపట్టిపోయాయి. సర్కార్ చదువుకు పాడె కట్టి సాగనంపడంలో కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రముఖపాత్ర పోషించాయి. వాటిలో మొదటిది శ్రీ చైతన్య అయితే రెండోది నారాయణ.

ఒక చెరువులోకి తిమింగలాన్ని వదిలితే అందులో వున్న చేపలన్నింటిని తిన్నట్లు, ఏ.పి విద్యావ్యవస్థలోకి ప్రవేశించిన కార్పొరేట్ విద్యా తిమింగలాలు శ్రీచైతన్య, నారాయణలు చిన్నాచితకా విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను కూడా మింగేసాయి. వీళ్ళ ఒక జిల్లా నుండి ఇంకో జిల్లాకు పాకుతూ ఆ జిల్లాలో వున్న చిన్నచిన్న ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లను కబలించుకునిపోతూ రాష్ట్ర విద్యారంగంలో ఇవి ఎదురులేని తిమింగలాలుగా మారాయి. కొన్నేళ్ళ క్రితం వరకు ర్యాంకులు, మార్కుల విషయంలో పోటాపోటీగా సాగిన శ్రీచైతన్య, నారాయణలు ఆ తర్వాత కాలంలో ఒక్కటయ్యాయి. ఇద్దరం కొట్టుకుంటుంటే మధ్యలో ఇంకొకరు దూరే అవకాశముందని చెప్పి కలిసిపోయారు. 'చైనా'(చైతన్య, నారాయణ) పేరుతో కొత్త విద్యాసంస్థలను ప్రారంభించి చదువుల వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగించారు.

మళ్ళీ ఈమధ్యనే ఈ రెండు సంస్థల మధ్య బెడిసింది. తమ ర్యాంకర్‌ను శ్రీచైతన్య వాళ్ళు అపహరించారంటూ నారాయణ విద్యాసంస్థల వాళ్ళు కేసు పెట్టారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన ఇద్దరు సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేసారు. దీంతో ఇరు సంస్థల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సుష్మాచౌదరి నెల్లూరొచ్చి ప్రెస్‌మీట్ పెట్టి నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై విరుచుకుపడ్డారు.

ఈ రెండు కార్పొరేట్ సంస్థల గొడవ సీఎం చంద్రబాబు దాకా వెళ్ళినట్లు తెలుస్తోంది. శ్రీచైతన్య వాళ్ళే ఈ పంచాయితీని ఆయన ముందు పెట్టారు. ఇటు చూస్తే నారాయణ చంద్రబాబుకు కుడిభుజం లాంటోడు. అటు చూస్తే శ్రీచైతన్య వాళ్ళది విజయవాడ. బాగా కావాల్సినవాళ్ళే! మరి ఇద్దరిమధ్య గొడవను ఆయన ఎలా పరిష్కరిస్తాడో చూడాలి.

జులై నాటికి...

# భూగర్భడ్రైనేజీ పనులు పూర్తి

**- పురపాలకమంత్రి డా.పి. నారాయణ**



జిల్లాలో 1100 కోట్ల రూపాయలతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ నిర్మాణం పనులు, మంచినీటి వసతులకు సంబంధించిన పనులు అన్నీ 2018 జులై నాటికి పూర్తిచేయడం జరుగుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ అన్నారు. గతనెల 30న నెల్లూరు, గోమతినగర్‌లో ఉన్న క్యాంప్‌కార్యాలయంలో సంబంధిత మునిసిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 43 కోట్ల రూపాయలతో జిల్లాలో చేపట్టిన డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి కార్యాక్రమాలు ఈ ఏడాది డిసెంబర్ 31నాటికి పూర్తిచేస్తామన్నారు. కాంట్రాక్టర్లు తెలిపిన చిన్నచిన్న సమస్యలను కూడా చర్చించి పరిష్కరిస్తామన్నారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులతో ప్రజలకు జరుగుతున్న అసౌకర్యాన్ని సహృదయంతో అర్థం చేసుకుని సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రజలకు శాశ్వతమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. పురప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటే సకాలంలో కన్నా కొంత ఆలస్యంగా పనులు జరుగుతాయని కాంట్రాక్టర్లు తెలిపారని అన్నారు. అక్కడక్కడా ఏర్పడిన చిన్న చిన్న గుంతలను గ్రావెల్‌తో పూరించాలని తాము వారికి సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు నగరపాలక కమిషనర్ ఢిల్లీరావు, మునిసిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# పోలీసులు బాధ్యతతో మెలగాలి

**- డిఐజి గోపాల్‌రావు**



పోలీసులు బాధ్యతతో మెలగాలని, విధుల్లో నిర్లక్ష్యం లేకుండా, ఎలాంటి పొరపాట్లు చేయకుండా నీతినిజాయితీలతో పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సౌత్ కోస్టల్‌రేంజ్ డిఐజి కెవివి గోపాల్‌రావు అన్నారు. గతనెల 28న ఆయన నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌లో ఆయన ఏఆర్ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం డిఐజి మాట్లాడుతూ, జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది, హోంగార్డులు ప్రతిఒక్కరూ ఎలాంటి దురలవాట్లకు లోనుకాకుండా, అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శరత్‌బాబు, వీరభద్రుడు, ఓఎస్డీ విఠలేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, నగర డిఎస్పీ మురళీకృష్ణ, రూరల్ డిఎస్పీ రాఘవరెడ్డి, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాస రావు, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, చంద్రమోహన్‌రావు, చిరంజీవితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువజన సమాఖ్య

# రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వసంతరావు శర్మ



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఇనమనమెళ్ళూరు వసంతరావుశర్మ నియమితులైనట్లు రాష్ట్ర సమాఖ్య ప్రధానకార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నెల్లూరుజిల్లా నాయుడుపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో నియామకపత్రం అందించారు. వసంతరావు శర్మ బ్రాహ్మణులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విశేష సేవలు అందించారు. శర్మ నియామకం పట్ల రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు మంకాల సురేష్‌శర్మ, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి గరుడాద్రి దత్తాత్రేయశర్మ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నార్నెపాటి రవిశర్మలు అభినందించారు.

# అక్రమంగా సిలికా తరలిస్తే క్రిమినల్ కేసులే!

**- డిఎస్పీ రాంబాబు**



గూడూరు ప్రాంతంలో ఉన్న సిలికా రవాణా ప్రక్రియలో నిబంధనలు పాటించకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గూడూరు డిఎస్పీ రాంబాబు తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో లారీ ఓనర్స్, లారీ ట్రాన్స్‌పోర్ట్, డ్రైవర్లు, ఇతర ప్రతినిధులతో మంగళవారం సిలికా తరలింపుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో ఉన్న సిలికా, ఇతర రాష్ట్రాలకు తరలించే లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు ఇకపై తప్పనిసరిగా జిపిఎస్ యంత్రాన్ని, వేబిల్లులు, ఇతర పత్రాలు సక్రమంగా ఉంటేనే గూడూరు ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రవాణాలో అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా రాకపోకలు సాగిస్తే చర్యలు తీవ్రంగా వుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.ఐ అక్కేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, లారీ యాజమాన్యాల సంఘం ప్రతినిధులు, డ్రైవర్ల అసోసియేషన్ సంఘం, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు ఉన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పంచాయితీరాజ్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**- రియాజ్ అహ్మద్**




రాష్ట్రంలో పంచాయితీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్ల సమస్యలను ఏపి పంచాయితీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ అన్నారు. కావలి పట్టణంలోని రహదారులు, భవనాల శాఖ అతిథిగృహంలో పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాల సాధనకు ఇంజనీర్లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నేడు గ్రామాల్లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయంటే ఇందుకు సహాయ ఇంజనీర్ల కృషి ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం వీరికి వర్తింపజేస్తామంటుందని, కానీ రెవెన్యూ శాఖకు ఇచ్చినట్లే క్షేత్రస్థాయిలో తిరిగే ఇంజనీర్లకు ఏ మాత్రం బయోమెట్రిక్ సరిపోదన్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సహాయ ఇంజనీర్లు ఎలాంటి పదోన్నతులు లేకుండానే పదవీవిరమణ చేస్తున్నారని, వీరికి డిప్యూటీ ఇఇ ప్రమోషన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో తీసుకున్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి అదనపు సిబ్బందిని నియమించాలని, ప్రతి సహాయ ఇంజనీరుకు ఇద్దరు చొప్పున సహాయకులను నియమించాలన్నారు. ప్రతి ఇంజనీరుకు నెలకు రూ. 3వేలు ప్రయాణఖర్చులు ఇవ్వాలని, పదేపదే సమావేశాలకు మినహాయింపు ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ల వేధింపులు లేకుండా చూడాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణయ్య, నెల్లూరుజిల్లా అధ్యక్షుడు మునవర్, ప్రధానకార్యదర్శి ఎం. శ్రీవాస్, అసోసియేట్ అధ్యక్షుడు చెన్నకేశవులు, జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ల ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతిఒక్కరు నిషేధించాలని ఇన్నర్‌వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ అధ్యక్షురాలు వరలక్ష్మి తెలిపారు. గూడూరు పట్టణంలోని ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సందర్శనలో భాగంగా పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద గోనెసంచులను ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం సరస్వతి శిశుమందిరంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ సహాయసహకారాలు అందించాలని తెలిపారు. జీవితంలో ప్రతి మనిషి కూడా విధిగా ఒక మొక్క నాటాలని చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళా మండలి ద్వారా గూడూరులో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి. రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభారెడ్డి, కార్యదర్శి విష్ణువందన మాట్లాడారు. కాగా పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలకు ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ దాతృత్వంతో క్రీడా సామాగ్రిని వ్యాయామ ఉపాధ్యాయురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ శ్రీవల్లి, క్లబ్ సభ్యులు వై.లక్ష్మి, పరంజ్యోతి, పరమేశ్వరి, శ్రీలక్ష్మి, కె.సీతమ్మ, స్వర్ణలత, సుప్రియ, జయలక్ష్మి, గిరిజ, అనిత, కమలసాయి, ప్రభావతి, నిర్మల, శశికళ, స్నేహలత తదితరులు ఉన్నారు.



నెల్లూరుజిల్లాలో ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను గొప్ప మనసుతో నిర్వహిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అక్టోబర్ 29న నెల్లూరులోని ఆయన స్వగృహంలో కలిసి సత్కరిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి సి.హెచ్.శ్రీనివాసరావు, డి.బి.శ్రీనివాసరావు, కడివేటి రామ్మూర్తి.

# దోమలతో పాదయాత్రకు బ్రేకులు

శ్రీను గల్పిక

అది ఇంగ్లాండ్ రాజధాని లండన్. ప్రఖ్యాత ఇంజనీర్ నార్మన్ పోస్టర్ ప్రతినిధులతో నవ్యాంధ్ర ముఖ్యమంత్రి, హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు, ముదురుదోమల శాఖ మంత్రి పి.నారాయణ, సినీ దర్శకులు రాజమౌళి, బోయపాటి శ్రీను, కె.రాఘవేంద్రరావులు సమావేశమయ్యారు. నార్మన్‌పోస్టర్ ప్రతినిధులు ఉండి, మీకు ఎటువంటి రాజధాని కావాలో సలహాలివ్వండి, దాని ప్రకారం డిజైన్ గీస్తాం అని చెప్పారు. చంద్రబాబు రాజమౌళి వైపు చూసాడు. వెంటనే రాజమౌళి స్పందించి... మీకు మొన్ననే బాహుబలి-1, 2 సి.డిలు చూపించాను, ఆ సినిమాల్లో వున్న కోట మాదిరిగా అసెంబ్లీ భవనం కావాలి. అలాగే అవంతి రాజ్యం యువరాణి చంద్రసేన వుంటున్న కోట లాంటి కోర్టు భవనం కావాలి. శత్రువులు చొరబడకుండా వాటి చుట్టూ కందకాలు తవ్వించాలి. భారీ ఏనుగులు, సింహాల విగ్రహాలు అమర్చాలి. అసెంబ్లీ ప్రాంగణంలో నూరడుగుల చంద్రబాబు విగ్రహం ఏర్పాటు చేయాలి... అని రాజమౌళి చెబుతుండగా, నార్మన్‌పోస్టర్ వుండి... లిఫ్టులు ఎన్ని పెట్టమంటారు అని అడిగాడు. దానికి రాజమౌళి... లిఫ్టులు అవసరం లేదు. ప్రతి అంతస్తు నుండి తాళ్ళు క్రిందకు వేలాడదీస్తాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఆ తాళ్ళు పట్టుకుని పాకుతూ పై అంతస్థులకు చేరుకుంటారు. నడవలేని వృద్ధ నాయకుల కోసం డోలీలు ఏర్పాటు చేస్తాం. ఆ డోలీలలో వారిని పైఅంతస్థులకు మోసుకెళతారు అని సలహా ఇచ్చాడు. తర్వాత బోయపాటి శ్రీను వుండి... రాజధాని ప్రాంగణంలోనే పెద్ద సరస్సు ఏర్పాటు చేయండి, దేశంలో పుష్కరాలు జరిగే పన్నెండు నదుల జలాలలను ఆ సరస్సులో నింపాలి. అప్పుడు ప్రతి ఏటా రాజధానిలోనే ఏ నది పుష్కరమైతే ఆ నది పుష్కరం చేసుకోవచ్చు. నా పాటికి నేను సెట్టింగ్‌లు వేసుకుంటాను, చంద్రబాబు గారికి చేతి నిండా పని అని చెప్పాడు. తర్వాత కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ రాజధానిలో పండ్ల చెట్లు బాగా వుండేలా డిజైన్ చేయండి, అన్ని రకాల ఫ్రూట్స్ దొరకాలి. అప్పుడే ఏపిలో ఎప్పుడన్నా సినిమాలు తీయాలంటే మాకు సులభంగా వుంటుందని చెప్పాడు. వీరు చెప్పిన సలహాలను వ్రాసుకున్న నార్మన్ పోస్టర్... ఈసారి బాగా డిజైన్ గీసి తెస్తామన్నాడు. అందుకు చంద్రబాబు... మీరు అంత తొందరగా డిజైన్ ఏమీ ఇవ్వబల్లేదు, నేనింకా రాజధాని కోసం పాతిక దేశాలు తిరగాలి, ఆ దేశాల రాజధానులు మాదిరిగా అమరావతిని తయారు చేస్తానని చెప్పాలి. కాబట్టి మునిగిపోయిందేమీ లేదు. ఇప్పుడు నువ్వు డిజైన్ ఇచ్చినా వెంటనే మేము కట్టేదేమీ లేదు. కాబట్టి నిదానంగా ఇవ్వండి అంటూ అక్కడనుండి లేచాడు.

★★★★★

అమరావతిలో చంద్రబాబు నివాసం. విలేకరుల సమావేశం పెట్టాడు. ప్రజల కోసం నేను 24గంటలూ కష్టపడుతున్నాను. అమెరికాలో వున్నా, లండన్‌లో వున్నా, దుబాయ్‌లో వున్నా నా మనసంతా అభివృద్ధి మీదే వుండింది. దీపావళి పండుగ కూడా చేసుకోకుండా అమెరికాలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమయ్యాను, నాగులచవితి రోజు లండన్‌లో నార్మన్ పోస్టర్‌తో సమావేశమయ్యాను అని చెబుతుండగా... అప్పుడే భువనేశ్వరీదేవి అక్కడకు వచ్చి... పండుగరోజుల్లో మిమ్మల్నెవరు విదేశాలకు పొమ్మన్నారు, పండుగలను చూసుకునే పొమ్మన్నాను కదా, ఎప్పుడు పోయినా మీరు చేసే పని ఒకటే కదా అని అంది. చంద్రబాబు నెత్తి నోరు బాదుకుని... నా అగచాట్లు ఏవో నేపడుతున్నాను, నువ్వు లోపలకెళ్లు అంటూ ఆమెను లోపలకు పంపించి, నేను దీపావళి చేసుకోవడం నాకు ముఖ్యం కాదు, ప్రతిరోజూ రైతులు దీపావళి చేసుకోవాలి, అందుకే నా ఈ శ్రమంతా అని అన్నాడు. అక్కడేవున్న 'చంద్రజ్యోతి' విలేకరి... సార్, జివిఎస్టీ దెబ్బకు పెరిగిన టపాసుల ధరలతో సంవత్సరానికి ఒకరోజు దీపావళి చేసుకోవడమే కష్టంగా వుంది, మరి రోజూ దీపావళి చేసుకోవడమంటే కష్టంగా వుంటుందేమో అని అడిగాడు. అందుకు చంద్రబాబు... నా ఉద్దేశ్యం దీపావళి అంటే రోజూ టపాకాయలు కాల్చాలని కాదు, రోజూ ఇంట్లో పిండి వంటలు చేసుకోవాలని... అని చెప్పాడు. ఏబిసి న్యూస్ ఛానెల్ విలేకరి వుండి... సార్, అమరావతి రాజధాని రైతులను సింగపూర్ పర్యటనకు పంపించడం వెనుక మీ ఉద్దేశ్యమేంటని అడిగాడు. చంద్రబాబు దానికి స్పందిస్తూ... రాజధాని పేరుతో ఇక్కడున్న రైతులందరి భూములు తీసుకున్నాం. ఇక వీళ్ళకు వ్యవసాయం చేసే అవకాశం లేదు. కాబట్టి వ్యవసాయం చేయకున్నా ఎలా బ్రతకాలో తెలియజెప్పేందుకే వ్యవసాయమే లేని సింగపూర్‌లో తిప్పుతున్నామని చెప్పాడు. టీవీ 25.5 విలేకరి వుండి... సార్, అమరావతి రాజధాని ఎప్పటికి కంప్లీట్ కావొచ్చంటారు అని ప్రశ్నించాడు. దానికి చంద్రబాబు... మీ ప్రశ్న రాంగ్... మీరు అడగాల్సింది ఎప్పుడు మొదలవ్వొచ్చంటారు? అని! ముందు మొదలుపెడితే కదా కంప్లీట్ కావడానికి. మేమింకా పాతిక దేశాలదాకా తిరగాలి. అక్కడి రాజధానులు చూడాలి... నార్మన్ పోస్టర్ ఇచ్చిన డిజైన్‌లను పరిశీలించాలి, వాటిని మా రాజమౌళి ఓకే చెయ్యాలి, బాహుబలి సినిమాలాగే అమరావతి రాజధాని కూడా రెండు పార్ట్‌లనుకోండి. మొదటి పార్ట్ అంటే ఈ టర్మ్‌లో రాజధాని డిజైన్ రూపకల్పన, పరిశీలన, శంకుస్థాపనలుంటాయి. నెక్స్ పార్ట్ అంటే రేపు మళ్ళీ మా ప్రభుత్వమే వస్తే రాజధాని నిర్మాణం మొదలవుతుంది అని చెప్పి అక్కడితో ప్రెస్‌మీట్ ముగించి అందరినీ పంపించేసాడు.

ప్రెస్‌వాళ్ళు వెళ్ళగానే ఇరు రాష్ట్రాల తెలుగుదేశం నాయకులు మోత్కుపల్లి నరసింహులు, ఎల్.రమణ, యనమల రామకృష్ణుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు లోపలకు వచ్చారు. మోత్కుపల్లి వుండి... సార్, మన ప్లాన్ సక్సెస్ అయ్యింది. ఆ రేవంత్‌రెడ్డి ఇప్పుడే పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇచ్చి వెళ్లాడు. ఇక మనం తెలంగాణలో కేసీఆర్‌తో హాయిగా చెట్టపట్టాలేసుకుని తిరగొచ్చు. ఆ రేవంత్‌తో అన్నీ తలనొప్పులే, ప్రతిదానికీ కేసీఆర్‌తో ఫైట్ అంటాడు. మనకేమో అతనితోనే అన్నీ పనులాయె అని అన్నాడు. తర్వాత యనమల వుండి... అక్కడ రేవంత్ తల నొప్పి పోయింది, ఇక్కడ జగన్ తలనొప్పి మొదలుకానుంది. ఆ జగన్ పాదయాత్ర మొదలుపెట్టబోతున్నాడు. నాకు కళ్ళ ముందు వై.యస్. పాదయాత్ర, ఆ తర్వాత సీన్‌లు కనిపిస్తున్నాయి. ఆ జగన్ పాదయాత్ర చేయకుండా అడ్డుకునే మార్గం లేదా? అని ప్రశ్నించాడు.

అప్పుడు చంద్రబాబు సోమిరెడ్డి వైపు నవ్వుతూ చూసాడు. అప్పుడు సోమిరెడ్డి... యనమలన్నా... జగన్ పాదయాత్రను బ్రేక్ చేయడానికి మా వద్ద స్కెచ్ రెడీగా వుంది. జగన్ పాదయాత్ర అనంతపురం, చిత్తూరుజిల్లాలను దాటి నెల్లూరుజిల్లాలోకి ప్రవేశిస్తుంది. మొదట వెంకటగిరి వద్ద పదికిలోల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలను సిద్ధంగా వుంచుతాం... అక్కడకు రాగానే ఆయనపై అవి దాడి చేస్తాయి. వాటిని కూడా తప్పించుకుని గూడూరు దాకా వస్తే అక్కడ పాతిక కిలోల దోమలు సిద్ధంగా ఉంచుతాం... ఇక్కడ కూడా మిస్ అయ్యాడనుకోండి... ఈసారి నెల్లూరులో టన్ను దోమలను సిద్ధం చేసి వుంచుతా... ఇక్కడ తప్పించుకోవడం చాలా కష్టం... దోమలు కరవడం, చికున్‌గున్యా జ్వరంతో కాళ్ళు నొప్పులొచ్చి జగన్ పాదయాత్ర ఆపేయడం... అంతా ప్రణాళిక ప్రకారం జరిగిపోతోంది అని వివరించాడు. చంద్రబాబుతో పాటు మిగతా తెలుగుదేశం నాయకులు కూడా ఆ మాటలను ఎంతో ఆనందంగా వినసాగారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక స్థితి సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల వృద్ధి శ్రమకు తగినట్లుండదు. ఆదాయం సామాన్యం. మీ నిర్ణయాలు ఆత్మీయులకు బాధ కలిగిస్తాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఖర్చులను పరిమితం చేసికొంటారు. కొత్త వ్యాపార, ఉద్యోగ ప్రయత్నాలు చేపడుతారు. అనుకున్న పనులు దక్షతతో నిర్వహిస్తారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఋణ బాధలు తొలగుతాయి. వృత్తి వ్యాపారాలు వేగం అందుకుంటాయి. ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులకు అవకాశాలు కలిసివచ్చి నెరవేరుతాయి. ఉద్యోగులకు మంచి గుర్తింపు, అధికారులకు స్థానమార్పుంటుంది. వ్యవహారాలలో పైచేయిగా నిలుస్తారు. రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ, పునర్వసు 1, 2, 3పాదాలు

పనులు నిదానంగా జరుగుతాయి. బంధువర్గంతో విభేదాలు రాకుండా జాగ్రత్తపడండి. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారినను, వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. కుటుంబ వ్యవహారాలను సామరస్యంగా పరిష్కరిస్తారు. ఆందోళన కలిగించే సమస్యలు సర్దుబాటు కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఈ రాశివారికి ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. నూతన వస్తు వాహనాలు సమకూరవచ్చును. గృహ నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు వేగంగా సాగుతాయి. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయం కాగలవు. పనులందు టెన్షన్‌గా ఉంటుంది. కొత్త పరిచయాలు, బంధుత్వాలు బలపడతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తివ్యాపారాలలో ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వ్యవహారాలలో కోపం, పట్టుదలను తగ్గించుకుని సర్దుకుని పోవడం మంచిది. కొత్త వ్యాపార పెట్టుబడి అవకాశాలు కల్పించబడతాయి. మిత్రులు, బంధువులు మీకు సహాయపడతారు. కుటుంబసౌఖ్యం బాగున్నది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఉద్యోగులకు ప్రభుత్వం, అధికారుల వత్తిడి ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరిగి ఆదాయం పెరుగుతుంది. నిరుద్యోగులకు అవకాశాలు దొరుకుతాయి. అగ్రిమెంట్లు జరగడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరకడం, రావలసిన బాకీలు కొంత లభించడం జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 3.11.2017 నుండి

తేది. 9.11.2017 వరకు

ఈ వారం మీన మేష వృషభ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, కన్యలో కుజుడు, తులలో రవి గురు శుక్రులు, వృశ్చికంలో బుధుడు, ధనుస్సులో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

పంచాంగము

తేది 3 శుక్రవారము కార్తీక పూర్ణిమ

తేది 8 బుధవారము గురుమౌఢ్యమి సమాప్తం.

మహూర్తములు లేవు

### కార్తీక మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | శుక్ర | చతుర్దశి | ప॥ గం.12.50వ॥ |
| తేది. 4 | శని | పూర్ణిమ | ప॥ గం.11.18వ॥ |

### కార్తీక మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 5 | ఆది | పాడ్యమి | ఉ॥ గం.9.27వ॥ |
| తేది. 6 | సోమ | విదియ | ఉ॥ గం.7.22వ॥ |
| | పిదప | తదియ | రా॥ గం.5.05వ॥ |
| తేది. 7 | మంగళ | చతుర్థి | రా॥ గం. 2.37వ॥ |
| తేది. 8 | బుధ | పంచమి | రా॥ గం.12.16వ॥ |
| తేది. 9 | గురు | షష్ఠి | రా॥ గం.10.11వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులు అధికంగా ఉండవచ్చును. ముఖ్యపత్రాలు, వస్తువులను జాగ్రత్త పరచుకొనాలి. వృత్తి వ్యాపారాలలో ప్రగతి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసికొనండి. బిడ్డల విద్యా, వివాహ విషయాలపై దృష్టి పెడతారు. వ్యవహార ఒప్పందాలకు ఇది తగిన సమయం. సోదరీ సోదరులకు మేలు జరుగుతుంది. ఆదాయం కొంత అదనంగా లభించగలదు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండాలి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. బంధువర్గంతో సమస్యలు కలుగవచ్చును. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. తొందరపడి ఋణాలు, హామీలు ఇవ్వవద్దు. ఉద్యోగులకు పనిభారం, వ్యాపారులకు అధికారుల వల్ల సమస్యలుంటాయి. మంచి ఆర్థిక అవకాశాలు చేజారిపోవచ్చును. విద్యార్థులు మరింతగా కష్టపడాలి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సాంకేతిక, శాస్త్ర వైద్య బోధనా రంగాల వారికి ఆదాయవృద్ధి ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. అధికారుల వల్ల అదనపు పనిభారం, శ్రమ ఉద్యోగులకు ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. కొత్త పెట్టుబడులకు, వ్యాపారాలకు తగిన సమయం. ఆరోగ్యం ఫరవాలేదు. పెండింగ్‌లో గల పనులు మరల సాగుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబ వ్యవహారాలలో భేదాభిప్రాయాలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరిగి ఆదాయం మేలుగా ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు కొంత లభించును. ఉద్యోగ నిర్వహణలో గుర్తింపు ఉంటుంది. ఆర్థికావకాశాలు లభించగలవు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పనులు, ప్రయత్నాలు నిదానంగా ఉంటాయి. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. ఉద్యోగులు తమ విధి నిర్వహణలోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా ఉండాలి. వాహనాలు నడిపేవారు, కరెంటు, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. దూర ప్రయాణాలుంటాయి. బిడ్డల విద్యా, శుభకార్య విషయాలలో శ్రద్ధ చూపుతారు. ఇతరులకు సహాయపడతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక ఇబ్బందులు తొలగి వృత్తి వ్యాపారాలలో ప్రగతికై ప్రయత్నాలు చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఉద్యోగులకు పని ఒత్తిడి, అధికారుల అజమాయిషి పెరుగుతుంది. మొగమాటాలకు, ప్రలోభాలకు లోబడవద్దు. భవిష్యత్తు గురించి ఆలోచనలు వస్తాయి.

### పిలిస్తే పలికే ఎమ్మెల్యేకి...

# స్వాగతం పలికిన జనం



'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమాన్ని ప్రారంభించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత నెల 31వ తేదీన సత్యంజీనగర్‌లోని ఇంటింటికి వెళ్ళి స్థానిక ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆరోజు రాత్రి లింగాయపాలెం కేశయ్యగౌడ్ ఇంట్లో బస చేసిన శ్రీధర్‌రెడ్డి, పక్కరోజు 1వ తేదీ 7 గంటలకే 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు. వర్షంలో తడుస్తూ తమ ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేను చూసి స్థానికులు ఆశ్చర్యంతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తనకు స్వాగతం పలికిన ప్రజలనుద్దేశించి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంత వరకు 33రోజుల పాటు సాగిన ప్రజాబాటలో మొత్తం 21గ్రామాల్లో 14వేల కుటుంబాలను నేరుగా కలిసే అదృష్టం తనకు దక్కిందని, మధ్యాహ్నం రాత్రి కలిపి 66 కుటుంబాల్లో తనకు భోజనం పెట్టారని, వారి అభిమానం, ఆప్యాయత ఎప్పటికీ మరిచి పోనని చెప్పాడు. ప్రజాబాటలో ప్రజలు ఇస్తున్న సూచనలు, సలహాలు, సద్విమర్శలు నిండు మనస్సుతో స్వీకరిస్తానని, వారి మార్గదర్శకత్వంలోనే తన భావి రాజకీయ జీవితం నడుస్తుందని పేర్కొన్నాడు. ప్రజలు చూపిస్తున్న అభిమానం వల్లే కాళ్ళు మంటలు పుడుతున్నా, అరికాళ్ళు బొబ్బలెక్కుతున్నా ఆ బాధను సైతం మరచి నడవగలుగుతున్నానని అన్నారు.

# బాధితుల పట్ల నిర్లక్ష్యం తగదు

### - పోలీసులకు కలెక్టర్ హితవు



జిల్లాలో ఎస్సీఎస్టీ అత్యాచార కేసులపై వెంటనే స్పందించి నిందితులపై కేసు నమోదు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుల పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పోలీసులకు హితవు పలికారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అట్రాసిటీ కేసులు, అత్యాచార కేసులు, భూములకు సంబంధించిన కేసులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులకు సరైన న్యాయం జరగడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని, బాధితుల పట్ల పోలీసులు నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నారని ఫిర్యాదులు నిత్యం అందుతున్నాయని కలెక్టర్ పేర్కొంటూ, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా విచారణ స్థాయిలో ఇంకా 274 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, సత్వరమే వాటిని పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి డి. మధుసూదనరావు, ఎస్సీఎస్టీ కోర్టు స్పెషల్ పి.పి విజయ, ఆర్డీఓలు, డిఎస్పీలు, అట్రాసిటీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ రభస

నెల్లూరు కార్పొరేషన్ 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి ప్రశాంత్‌కిరణ్ 1వ తేదీ కార్పొరేషన్ కార్యాలయంలో నానా రభస సృష్టించాడు. బి.వి.నగర్‌లోని కెవిఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో పనిచేసే ముగ్గురు విద్యావాలంటీర్ల వేతనాల బిల్లులకు సంబంధించి ఆయన ఎగ్జామినర్ ఎలీషాతో గొడవ పడ్డారు. కార్పొరేషన్ కార్యాలయంలోనే ఇంటికి వెళ్ళబోతున్న ఎగ్జామినర్ ఎలీషా కారు తాళాలు లాక్కున్నాడు. దీంతో ఎలీషా తన గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. కార్పొరేటర్ అతని సెల్‌ఫోన్ లాక్కుని గదికి తాళం వేసి నిర్బంధించాడు. తమ వేతనాల బిల్లులు చెల్లించడానికి ఎగ్జామినర్ లంచం డిమాండ్ చేస్తున్నాడని వాలంటీర్లు కార్పొరేటర్‌కు చెప్పడంతో ఆతను ఈ చర్యలకు దిగాడు. కార్పొరేషన్ మేనేజర్ గిరిజ, ఇతర అధికారులు వచ్చి సర్ది చెప్పి ఎగ్జామినర్‌ను బయటకు రప్పించారు.

# 'కార్తీక' లక్షదీపోత్సవం

(3వ పేజీ తరువాయి)



లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ధర్మపురం తుని తపోవన మఠాధిపతి శ్రీ సచ్చిదానందస్వామి మాట్లాడుతూ, సమాజంలోని దుష్టగుణాలను తొలగించేదీ, పాపాలను నశింపజేసి లోకానికి శాంతిని కలిగించేదీ కార్తీక దీపమని అన్నారు. కార్తీక దీపారాధన చేయడం ఎంతో పుణ్యప్రదమన్నారు. దీపదానం, గోదానం, అన్నదానం వంటి పుణ్యకార్యాలను అందరూ ఆచరించాలని కోరారు. కార్తీకమాసం పుణ్యఫలితాన్ని అందరికీ అందజేసేందుకు ఈ వేడుకలు నిర్వహించడం పుణ్యాకార్యమంటూ నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వామీజీని వేమిరెడ్డి దంపతులు సత్కరించి అనుగ్రహ ఆశీస్సులను పొందారు. మూడవరోజు ఉదయం జరిగిన సత్యనారాయణవ్రత పూజల్లో 501 మంది దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వేమిరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి కార్తీక దీపోత్సవ వేడుకను ప్రారంభించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సహస్రదీపాలంకరణ సేవ జరిగింది. వేదపండితులు గట్టుపల్లి పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఎంతో వేడుకగా శివపార్వతుల కళ్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బుర్రా భాస్కరశర్మ పాల్గొని కాశీఖండం విశిష్టతను భక్తులకు వివరించారు. నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు. కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, ఎం.విశ్వనాథ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కోట సూర్యనారాయణ, ఓ.సంపత్‌రాజు, ఆమంచర్ల ప్రభాకరరావు పర్యవేక్షించారు. మూడు రోజుల ఈ వేడుకల్లో బిజెపి నాయకులు పి.సురేంద్రరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరులతో పాటు అనేకమంది ప్రముఖులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ప్రపంచ వ్యాప్తంగా...

# లయన్స్‌క్లబ్ సేవలు ఎనలేనివి



ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివని, ఆ ఘనత లయన్స్‌క్లబ్‌కే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గత నెల 29వ తేదీ నెల్లూరు విఆర్‌సి సెంటర్ సమీపంలోని శుభమస్తు షాపింగ్‌మాల్ ఆవరణంలో లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ శతాబ్ది ఉత్సవాల కార్ల ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలను అందించడంలో క్లబ్ స్ఫూర్తితో సేవా సంస్థలు ముందుకు సాగాలన్నారు. లయన్స్ క్లబ్ గవర్నర్ రామిరెడ్డి మోహన్‌రావు, మాజీగవర్నర్ వై.శ్రీనివాసరావు, ఇంటర్నేషనల్ గవర్నర్ వరప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, బయ్యా వాసు పాల్గొన్నారు.

# అధిక ఉప్పుతో ముప్పు తప్పదు

### - డాక్టర్ బిందు మీనన్



అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ వైద్యశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి 5పాఠశాలల నుంచి 8,9,10 తరగతులకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేకమైన స్టాల్స్‌ను ఏర్పాటు చేసిన వైద్యుల బృందం, ఆయా స్టాల్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ పక్షవాతం రావడానికి గల కారణాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ముఖ్యంగా ఏఏ ఆహార పదార్థాలను ఏఏ మోతాదుల్లో తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఒకరు పక్షవాతానికి గురవుతున్నారని, దాదాపు 60మిలియన్ల ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. అందులో 5 మిలియన్ల మంది రోగులు పక్షవాతం కారణంగా ప్రాణాలు విడుస్తున్నారని, మరో 4 మిలియన్ల మంది మంచానికే పరిమితమై బాధను అనుభవిస్తున్నారని చెప్పారు. అధిక శాతం 25 నుంచి 40ఏళ్ల వయస్సులో వారు కూడా ఇటీవల పక్షవాతానికి గురవతుండటం ఆందోళన కలిగిస్తుందని స్పష్టం చేశారు. అధికమోతాదులో ఉప్పును తీసుకోవడం వల్ల బీపీ పెరుగుతుందని, తద్వారా ఆ వ్యక్తి అధిక టెన్షన్‌కు గురై పక్షవాతావం వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని డాక్టర్ బిందు మీనన్ వెల్లడించారు. రోజుకు ప్రతి మనిషికి 2.4 గ్రాముల ఉప్పు అవసరమని, అంతేకంటే ఎక్కువ మోతాదులో ఉప్పుతీసుకోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిట్ యూనిట్ హెడ్ నవీన్, హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, న్యూరాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు,.

# రెయిన్‌బో కుటుంబ దినోత్సవ వేడుకలు

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో కిండర్‌గార్డెన్ విభాగం నుండి మూడురోజుల పాటు వివిధ రకాల ఉత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా ముందుగా యుకెజి తరఫున కుటుంబ దినోత్సవం జరిగింది. ప్రతి మనిషికి కుటుంబం ఎంతో అవసరమని, కుటుంబం లేకపోతే సంఘమే లేదని పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండవరోజు ఫ్లేక్లాసు తరఫున మామ్ అండ్ మి కార్యక్రమం జరిగింది. ఇందులో తల్లి యొక్క గొప్పతనం గురించి తెలియజేశారు. చివరగా మూడవ రోజు ఎల్‌కెజి నుండి కులినరిడే కార్యక్రమం జరిగింది. ఇందులో తల్లులు తమ చిన్నారులతో కలిసి చిన్నచిన్న వంటలు చేశారు. ఇందులో చిన్నారులు తమ తల్లి చేసిన వంటను గురించి, వాడిన పదార్థాలు, తయారు చేయు విధానం గురించి ముద్దుముద్దుగా చెప్పారు.

# మొబైల్ టెక్నీషియన్ల సంఘం ఏర్పాటు అభినందనీయం

**- ఎమ్మెల్యే అనిల్**



నెల్లూరులోని మొబైల్ టెక్నీషియన్స్ అందరూ కలసి ఒక అసోసియేషన్‌గా ఏర్పడడం అభినందనీయమని నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గతనెల 29న నగరంలోని కామాటివీధి కృష్ణమందిరంలో జరిగిన అసోసియేషన్‌వారు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టెక్నీషియన్స్ అందరూ ఒక అసోసియేషన్‌గా ఏర్పడి ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకోవడమే కాక, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తుండడం సంతోషదాయకమన్నారు. ప్రజల నిత్యజీవితంలో మొబైల్ ఒక అత్యవసరమైన పరికరంగా ఉందని అంటూ, అసోసియేషన్‌వారికి ఎల్లప్పుడూ తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు, అసోసియేషన్ అధ్యక్షులు ఆరిఫ్, వైఎస్సార్సీపి నాయకులు ఎం.ఖలీల్‌అహ్మద్, శివపురం సురేష్, వేలూరు మహేష్, శివాచారి, రామకృష్ణాచారి, హనుమాచారి, శంకర్ చంద్ర, జయకృష్ణారెడ్డి, చంద్ర, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆయనే అధిపతి

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ప్రాజెక్ట్‌తో పాటు పట్టిసీమ, పురుషోత్తమపట్నం, ఇంకా పలు ఇరిగేషన్ పెండింగ్ ప్రాజెక్ట్‌ల పనులు జరుగుతున్నాయి. ఇరిగేషన్ వ్యవహారాలలో చంద్రబాబు, దేవినేనిల మధ్య కో-ఆర్డినేషన్ బాగానే వుంది. సీఎం కనుసన్నలలో దేవినేని ఇరిగేషన్ వ్యవహారాలు చక్కబెడుతున్నాడు. ఇటీవల మంత్రివర్గ విస్తరణ ద్వారా పదవులు పొందిన అమర్‌నాథ్‌రెడ్డి, అఖిలప్రియ, ఆదినారాయణరెడ్డిలకు వాళ్ళ శాఖల విషయంలో కొంత స్వతంత్రత ఇచ్చారు. ఎందుకంటే వైసిపి నుండి వచ్చిన వాళ్ళు కాబట్టి వాళ్ళ శాఖల్లో వేలు పెట్టే సాహసం చేయడం లేదు. మొన్న విస్తరణలో వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగానే నడుచుకుంటూ వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంకు ఓట్ల రూపంలో లబ్ధి చేకూర్చేందుకు తన ప్రయత్నాలు తాను చేస్తున్నాడు. సోమిరెడ్డికి సమర్ధుడని పేరుండడం, చురుకుగా పని చేస్తుండడంతో ఆయన వ్యవహారాలలోనూ జోక్యం ఉండడం లేదు.

మిగిలిన చాలా మంత్రివర్గ శాఖల్లో చినబాబు లోకేష్ ప్రమేయం ఎక్కువగా వున్నట్లు తెలుస్తోంది. హోంశాఖ అయితే మంత్రి నిమ్మకాయల రాజప్ప కంటే చంద్రబాబు, లోకేష్‌ల పర్యవేక్షణలోనే ఎక్కువగా వుంటోంది. ఉన్నతాధికారుల బదిలీలు ఎక్కువగా లోకేష్ ఆదేశాలతోనే జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎస్.ఐ., సి.ఐల బదిలీలకు కూడా లోకేష్ వద్దకు వెళ్తున్నారు. హోంమంత్రి సొంతంగా కాకుండా లోకేష్ ఆదేశాలకు అనుగుణంగా బదిలీలు చేస్తున్నాడని సమాచారం. ఇక రెవెన్యూ శాఖ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తిని అయితే ఎప్పుడో డమ్మీని చేసిపెట్టారు. అమరావతి రాజధానిలో భూముల సేకరణ అంతా ఆయన పర్యవేక్షణలో జరగాలి. ఆయనతో పని లేకుండా భూముల సేకరణ కానిచ్చారు. ఆఖరకు రెవెన్యూలో ఉన్నతాధికారుల బదిలీపై కూడా ఆయనకు అధికారం లేకుండా చేసారు. హోం, రెవెన్యూలతో పాటు వివిధ శాఖల్లో ఉన్నతాధికారుల బదిలీలు గాని, పనులు కేటాయింపు వంటి వ్యవహారాలుగాని నేరుగా చిన్నబాబు పర్యవేక్షణలోనే జరుగుతున్నట్లు సమాచారం.

# తప్పటడుగా? తప్పని అడుగా?

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలను బహిష్కరిస్తున్నామని ప్రకటించడం ద్వారా ప్రతిపక్ష నేత చేతిలో వున్న వజ్రాయుధాన్ని వదులుకున్నాడనిపిస్తోంది. ఈనెల 10వ తేదీ నుండి జరిగే శాసనసభ సమావేశాలను బహిష్కరించాలని ప్రతిపక్ష వైకాపా నిర్ణయించింది. దీంతో శాసనసభ పక్ష సమావేశాలు ఏకపక్షంగా, అధికారపార్టీ భజన కార్యక్రమంగా ముగియబోతున్నాయి.

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడానికి వైకాపా చూపిన ప్రధాన కారణం తెలుగుదేశంలో చేరిన తమ పార్టీ ఎమ్మెల్యేలు 21మందిపైన చర్యలు తీసుకోకపోవడం వల్లేనని. రాజకీయాలలో విలువలు పాటించేవాళ్ళు ఒక పార్టీలో గెలిచి, ఇంకో పార్టీలోకి వెళుతున్నప్పుడు వున్న పదవులకు రాజీనామా చేస్తారు. మొన్న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి శిల్పా చక్రపాణిరెడ్డి వైసిపిలో చేరినా, నిన్న రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినా విలువలు పాటించినవాళ్ళే! వైసిపి నుండి 21మంది ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరితే ఒక్కరంటే ఒక్కరు కూడా విలువలకు కట్టుబడి రాజీనామా చేయలేదు. దేశమంతా ఈ అన్యాయం చూస్తూనే వుంది. అయినా ప్రశ్నించేవారు లేరు. అయితే దీనిని శాసనసభా వేదిక మీదే తేల్చుకోవాలి. అక్కడే ఈ విలువలు లేని వ్యవహారాన్ని ఎత్తిచూపాలి. ఎందుకంటే అధికారపార్టీకి, ప్రతిపక్ష పార్టీకి రెండు చోట్ల మాత్రమే ప్రత్యక్ష పోరాటం జరుగుతుంది. ఒకటి ఎన్నికల రణ క్షేత్రంలో, రెండోది శాసనసభ కురుక్షేత్రంలో! అధికారపక్షానికి ఎదురు నిలిచి ప్రశ్నించగలిగేది, వారి లోపాలను ప్రజల ముందు వేలెత్తి చూపగలిగేది. ప్రజాసమస్యలపై తమ గళాన్ని వినిపించగలిగేది అసెంబ్లీలోనే! కాబట్టి అసెంబ్లీలో మాట్లాడే, పోట్లాడే అవకాశాన్ని జగన్ వదులుకుని ఉండకూడదు.

ఈ మూడున్నరేళ్ళలో జరిగిన అసెంబ్లీ సమావేశాలు చూసాము. ఈసారి ఉన్న గలీజు అసెంబ్లీ ఎప్పుడూ చూడలేదు. గతంలో ప్రభుత్వాలు కాని, స్పీకర్ గాని ప్రతిపక్షానికి సముచిత ప్రాధాన్యత, గౌరవం ఇచ్చేవాళ్ళు. కాని ఈ ప్రభుత్వంలో అసెంబ్లీ సమావేశాలు మరీ దిగజారినట్లుగా జరగుతున్నాయి. అనుభవం, అర్హత లేనివాళ్ళు ఎమ్మెల్యేలై అనవసరపు రంకెలు వేస్తూ సభను ఛండాలం చేస్తున్నారు. రౌడీలు, గూండాలను తలపించేలా వారి మాటలుంటున్నాయి. ఒకరిపట్ల ఒకరికి గౌరవ ప్రదమైన సంభాషణలే కరువయ్యాయి. ఇంతటి దారుణస్థితిలో వున్న శాసనసభ సమావేశాలలో కూడా ప్రతిపక్షనేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో చక్కగా రాణించాడు. పలు అంశాలపై, పలు సమస్యలపై పూర్తి సమాచారంతో ప్రభుత్వాన్ని ఆయన ఏకిపారేస్తున్న తీరుకు ప్రజలు ముగ్ధులౌతున్నారు. అసెంబ్లీ సమావేశాలలో అధికారపార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతగా రంకెలు వేసి రెచ్చగొట్టినా సహనం కోల్పోకుండా, సంయమనం పాటిస్తూ, ప్రజాసమస్యలపై ఘాటుగా స్పందిస్తున్న నేతగా అసెంబ్లీ వేదిక ద్వారానే జగన్‌కు పేరొచ్చింది. అలాంటి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదనుకోవడం ఖచ్చితంగా అలవాటులో పొరపాటేననుకోవాలి.

ఇప్పుడైతే ప్రతిపక్షం చేతిలో ఎన్నో అస్త్రాలున్నాయి. మూడున్నరేళ్ళ నుండి అమరావతి రాజధాని అని సినిమాలు చూపిస్తున్నారే గాని, ఒక్క అడుగు ముందుకు పడలేదు. రాజధాని డిజైన్‌లు అంటూ సినీ డైరెక్టర్లను వెంటబెట్టుకుని ఇంకా విదేశాలు తిరుగుతున్నారు. రాజధాని కోసమంటూ 35వేల ఎకరాల భూములను సేకరించి రైతులను బికారులుగా మార్చి పొలాలను బీళ్ళుగా పెట్టి వారి బ్రతుకులను ప్రశ్నార్ధకం చేశారు. పోలంవరం అంచనాలు ఎప్పటికప్పుడు పెంచుకుంటూ దానిని ఎప్పటికి పూర్తవుతుందో తెలియని ప్రాజెక్టుగా మార్చారు. కార్పొరేట్ కాలేజీలలో ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. అధికారులపై వేధింపులతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోంది. ఉపాధిహామీలు అటకెక్కాయి. నిరుద్యోగభృతి లేదు. ఋణమాఫీ అస్తవ్యస్తంగా ఉంది. డ్వాక్రా మహిళల హామీలు ఒక్కటీ నెరవేర్చలేదు. కాపుల బీసీ రిజర్వేషన్ హామీ ఆచరణ రూపం దాల్చలేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అధికారపార్టీ ఆగడాలు, అరాచకాలు ఎక్కువగా వున్నాయి. ఇంకా ప్రభుత్వ వైఫల్యాలు చాలానే ప్రస్తావించడానికి అసెంబ్లీని వేదికగా మార్చుకుని ఉండొచ్చు. ఇలాంటి కీలక సమయంలో జగన్ అసెంబ్లీని బహిష్కరించడమంటే అది తెలిసీ వేసిన తప్పటడుగా? లేక ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యకు ఇంక ఏ దారీలేని పరిస్థితుల్లో తప్పకవేసిన అడుగా? జగన్‌కే తెలియాలి?

# పోలీసులపై నిందలు సరికాదు

**- పోలీసు అధికారుల సంఘం**



సమర్ధవంతంగా పనిచేస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతున్న జిల్లా పోలీసులను అవినీతిపరులుగా ముద్రవేయడం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు తగదని పోలీసులు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్‌రావు, గౌరవాధ్యక్షులు మూర్తి గంగాధర్, సభ్యులు తురకా శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. . రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, సంఘవ్యతిరేక కార్యకలాపాలను అదుపు చేసేందుకు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఎంతగానో చొరవ తీసుకుని కృషిచేస్తున్న తరుణంలో ఇలాంటి విమర్శలు మంచిది కాదని వారు సూచించారు. జిల్లా ఎస్పీగా పిహెచ్‌డి రామకృష్ణ వచ్చాక జిల్లా ఎంతో పురోగతి సాధించడం జరిగిందని ముఖ్యమంత్రి కూడా ఇటీవల జిల్లా ఎస్పీని, పోలీసులను కొనియాడిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలే కానీ పోలీసువ్యవస్థను కించపరచడం సముచితం కాదన్నారు.

# వేడుకగా విజయవర్ధన్‌రెడ్డి షష్టిపూర్తి



అల్లూరు రామకృష్ణా విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్..మినర్వాగ్రాండ్ సంస్థల అధినేత అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి షష్టిపూర్తి వేడుక గతనెల 26న సికిందరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పర్వతరెడ్డి ప్రభాకరరెడ్డి, మారంరెడ్డి నరేంద్రరెడ్డి, ఆడిటర్ పి.మురళీమోహన్‌రావు, మాజేటి సురేంద్రనాథ్, వి.కృష్ణమోహన్‌రెడ్డి, కుందం నరేంద్రరెడ్డి, రాకేష్ అహుజా తదితరులు పాల్గొని విజయవర్ధన్‌రెడ్డి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని, ఆయనతో తమకున్న అనుబంధాన్ని వివరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, తన ఉన్నతికి ప్రోత్సహించిన మాతృమూర్తి రంగమ్మ, తన శ్రీమతి ఇందిరమ్మ, తమకు సహకారాన్ని అందించిన పర్వతరెడ్డి ప్రభాకర రెడ్డిల గురించి ప్రస్తావిస్తూ వారిని ఎన్నటికీ మరువలేనన్నారు. ఈ కార్యక్రమానికి తొలుత మేడా రఘురామిరెడ్డి ఆహ్వానం పలికి సభ నిర్వహించారు. విజయవర్ధన్‌రెడ్డి కుమార్తె శ్రీమతి తరణ్యతో పాటు ఆయన కుటుంబసభ్యులు, బంధుమిత్రులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణా జూనియర్ కళాశాల విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు కోట రాజశేఖర్ అవధాని విజయవర్ధన్‌రెడ్డి దంపతులను పద్యరత్నాలతో సత్కరించగా, అనంతరం అవధానిని ఆ దంపతులు ఘనంగా సన్మానించారు.

# మోహన్‌సాయికి అభినందన



జిల్లా స్థాయి పాలిటెక్నిక్ ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించి విజయవాడలో ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న కొడవలూరు మండలం దామేగుంటకు చెందిన విద్యార్థి పోట్ల మోహన్‌సాయిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు పోలయ్య ఘనంగా సత్కరించి అభినందించారు. దామేగుంటలో జరిగిన ఈ కార్యక్రమంలో పోట్ల రఘురామయ్య, విద్యార్థి తల్లిదండ్రులు పోట్ల లలిత-శ్రీహరి, కె.మల్లికార్జునరావు తదితర బంధుమిత్రులు పాల్గొని ఆ విద్యార్థిని అభినందించారు.



# ఈయనకు అధికారులంటే పడదా?

• **వివాదాస్పదంగా ఎమ్మెల్యే వైఖరి**

*తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలను తన్నేవాడు ఇంకొకడొస్తాడనే సామెత ఒకటుంది. అధికారులంటే పడని ప్రజాప్రతినిధిగా గతంలో కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు పేరుండేది. ఆయన **1994-99, 2004-2009**ల మధ్య ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చాలా మంది అధికారులతో వివాదాలొచ్చాయి. ఎమ్మెల్యే కాకముందే ఒక ఎస్.ఐ మీద దౌర్జన్యం చేసాడన్న కేసుంది. తొలిసారి ఎమ్మెల్యేగా వున్నప్పుడు కలెక్టర్‌గా వున్న శ్రీలక్ష్మిని ఏకవచనంతో సంభోదించి వివాదాన్ని రాజేశాడు. ఆ తర్వాత కొందరు ఎమ్మార్వోలతోనూ ఇతర అధికారులతోనూ గొడవపడ్డారు. అధికారులంటే పడని ఎమ్మెల్యేగా మొదటి నుండి ఆయనకు పేరుండేది. ఇప్పుడు రాజకీయాలలో ఆయన తెరమరుగైవున్నాడు.*

కాగా, ప్రస్తుతం ఆయన స్థానాన్ని 2014 ఎన్నికల్లో వెంకటగిరి నుండి ఆయన మీదే గెలిచి ఎమ్మెల్యే అయిన కురుగొండ్ల రామకృష్ణ భర్తీ చేస్తున్నాడేమోననిపిస్తోంది. ఈ జిల్లాలో అధికారుల మీద ఒంటి కాలిపై లేచే వారిలో ఆయనే మొదటిస్థానంలో వున్నాడు. 2014లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక సందర్భంగా జడ్పీ హాలులో ఆయన చేసిన రభసను రాష్ట్రమంతా చూసింది. అప్పటి కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పట్ల ఆయన చాలా అవమానకరంగా ప్రవర్తించారు. ఆ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. అలాగే గతంలో ఎస్పీగా వుంటూ ఎర్రచందనం స్మగ్లర్ల తాట తీసిన సెంథిల్‌కుమార్ పట్ల కూడా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యతిరేక వైఖరినే కొనసాగించాడు. ఆయన బదిలీ కోసం శాయశక్తులా ప్రయత్నించారు. ఎర్రచందనం స్మగ్లర్ల జాబితాను పూర్తి చేయకుండానే సెంథిల్‌కుమార్ ఇక్కడ నుండి బదిలీ కావడం జరిగింది. తాజాగా ప్రస్తుతమున్న ఎస్పీ రామకృష్ణతోనూ ఎమ్మెల్యే రామకృష్ణకు పడడం లేదు. ఎస్పీపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నాడు. ఈ ఎస్పీ బదిలీ కోసం ఆయన ప్రయత్నిస్తున్నాడు. అధికారులు, ముఖ్యంగా ఖాకీ యూనిఫాం వేసుకుని పనిచేసే వాళ్ళంటే వీళ్ళకు ఎందుకు పడటం లేదో?!






# వీపీఆర్ అన్నదానాలు



ప్రముఖ పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ వేమిరెడ్డి శ్యామలమ్మ నాల్గవ వర్ధంతి సందర్భంగా 1వ తేదీ బుధవారం నెల్లూరులో భారీఎత్తున పేదలు, వృద్ధులు, అనాథలు, యాచకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వాత్సల్య అనాథాశ్రమం, ప్రగతి ఛారిటీస్, గీతామయి వృద్ధాశ్రమాలతో పాటు చిల్డ్రన్స్ పార్క్ సాయిబాబా మందిరం, బారాషహీద్ దర్గాల వద్ద అన్నదానం నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను ఫౌండేషన్ సి.ఇ.ఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి పర్యవేక్షించారు.











Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com